www.prajavinikidi.com
RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక
తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -167 శనివారం 3 అక్టోబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా అల్పాహార పథకం

**పాఠశాలల్లో అల్పాహార పథకం.. సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు**

**సెంట్రలైజ్డ్ కిచెన్ల ఏర్పాటుకు హరేకృష్ణ ఫౌండేషన్‌తో ఒప్పందాలు**

**నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లలో వంటశాలల కోసం ముందుకొచ్చిన ప్రైవేటు సంస్థలు**

**నవంబర్ 30 కల్లా ఏర్పాట్లు పూర్తి చేయాలని సీఎం రేవంత్ ఆదేశం**

**ఆహార నాణ్యత కు కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయాలని సూచన**



**హైదారాబాద్, అక్టోబర్ 02(ప్రజావినికిడి):**
ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం అమలు చేయనున్న అల్పాహార పథకం ఏర్పాట్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేగవంతం చేశారు. డిసెంబర్ 9వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని ప్రారంభించేందుకు వీలుగా నవంబర్ 30 నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ పథకంలో భాగంగా సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటుకు సంబంధించిన ఒప్పందాలు నేడు ముఖ్యమంత్రి సమక్షంలో జరిగాయి.
జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో, అత్యాధునిక వంటశాలల ఏర్పాటుకు హరేకృష్ణ ఫౌండేషన్‌కు మిగతాది 2లో...

# హాకీలో స్వర్ణం

**44 ఏళ్ల నిరీక్షణకు తెరదించిన మహిళల హాకీ టీమ్**

**ఆసియా గేమ్స్ మహిళల హాకీలో భారత్‌కు స్వర్ణ పతకం**

**ఫైనల్లో చైనాపై 1-0 తేడాతో ఉత్కంఠభరిత విజయం**

**2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించిన భారత్**



**అక్టోబర్ 02(ప్రజావినికిడి):**
భారత మహిళల హాకీ జట్టు అద్భుతం చేసింది. ఏళ్ల తరబడి ఊరిస్తున్న ఆసియా గేమ్స్ స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. ఏకంగా 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ శుక్రవారం జరిగిన ఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ చైనాను ఓడించి పసిడి పతకాన్ని ముద్దాడింది. ఈ చారిత్రాత్మక విజయంతో భారత క్రీడా ప్రపంచంలో సంబరాలు అంబరాన్నంటాయి.అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత జట్టు 1-0 తేడాతో చైనాపై గెలుపొందింది. ఆట తొలి క్వార్టర్‌లోనే లాల్‌రెమ్‌సియామి హ్మార్జోతే అద్భుతమైన ఫీల్డ్ గోల్ చేసి భారత్‌కు ఆధిక్యాన్ని అందించింది. మిగతాది 2లో...

# గాడ్సే భావజాలాన్ని తిప్పికొట్టాలి

**గాంధీ ఆశయాల స్ఫూర్తితోనే మా పాలన**

**ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**

**గాంధీ భవన్‌లో గాంధీ జయంతి వేడుకలు**

**హైదారాబాద్, అక్టోబర్ 02(ఆర్ఎన్ఏ):**



**హైదారాబాద్, అక్టోబర్ 02(ప్రజావినికిడి):**
గాంధీ జయంతిని పురస్కరించుకుని జాతిపిత మహాత్మా గాంధీకి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఘన నివాళు లర్పించారు. గాంధీజీ ఆశయాల స్ఫూర్తితోనే రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, వివక్ష లేని సమాజ నిర్మాణమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. గాడ్సే భావజాలాన్ని వ్యాప్తి చేస్తూ, స్వాతంత్ర్య ఉద్యమ మిగతాది 2లో...

# మీరు నా ఆరాధ్య దైవం

**మోదీతో అంటూ స్మిత్ భావోద్వేగం**

**ఫైదుబాయ్ హీరో పైలట్ స్మిత్ మచ్ఛర్‌కు ఫోన్ చేసిన ప్రధాని మోదీ**

**స్మిత్ ధైర్యసాహసాలను కొనియాడి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష**

**దాడి సమయంలో హనుమాన్ చాలీసా పఠించానని ప్రధానికి వివరించిన పైలట్**

**వైద్య సహాయంతో పాటు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చిన ప్రధాని**





# కరవుసీమ ఇకపై కనకసీమ



**మదనపల్లెలో “గ్లోబల్ హార్టికల్చర్ హబ్ - ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్“ శంకుస్థాపన**

**సాగునీరు అందిస్తే సీమ రైతులు బంగారం పండిస్తారన్న చంద్రబాబు**

**మూడేళ్లలో 36 ప్రాజెక్టులు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని వ్యాఖ్య**

**మదనపల్లె అక్టోబర్ 02(ప్రజావినికిడి):**
కరవుపీడిత రాయలసీమ తలరాతను, రూపురేఖలను మార్చేందుకు గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌ను తీసుకొచ్చామని, ఈ ప్రాంతాన్ని ఫ్రూట్ బౌల్‌గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. 2లో...






# కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి హరీశ్ రావు లేఖ

**టీజీ ట్రాన్స్‌కోలో 26 శాతం వాటాల విక్రయాన్ని ఆపాలని వినతి**

**ఇది విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు తొలి అడుగని ఆందోళన**

**కాంగ్రెస్ జాతీయ విధానాలకు ఇది విరుద్ధమని లేఖలో ప్రస్తావన**

**హైదారాబాద్, అక్టోబర్ 02(ప్రజావినికిడి):**
తెలంగాణలోని కీలక విద్యుత్ రంగ సంస్థల్లో వాటాల విక్రయం లేదా ప్రైవేటీకరణ ప్రయత్నాలను అడ్డుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి లేఖ రాశారు. టీజీ ట్రాన్స్‌కోలో 26 శాతం వాటాలను ఐపీఓ మిగతాది 2లో...

# గాంధీ ఆరాధించిన రాముడు ధనికుల దేవుడా

**కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై బండి సంజయ్ ఫైర్**

**గాంధీ ఆశయాలను ప్రధాని మోదీ నెరవేరుస్తున్నారని, నిజమైన వారసులు బీజేపీయేనని వ్యాఖ్య**

**ఖైరతాబాద్ ఉపఎన్నికలో హిందూ ఓట్లను ఏకం చేసి బీజేపీని గెలిపిస్తామని ధీమా**



**హైదారాబాద్, అక్టోబర్ 02(ప్రజావినికిడి):**
కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ శుక్రవారం గాంధీ జయంతి వేడుకల సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జమ్మికుంటలో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి మిగతాది 2లో...

# కొడంగల్‌లో సభ పెడతాం

**రేవంత్ కు చెమటలు పట్టిస్తాం**

**ఖైరతాబాద్ లో బీఆర్ఎస్ గెలుపు ఖాయం**

**తలసాని శ్రీనివాస్ యాదవ్ తీవ్ర వ్యాఖ్యలు**

**హైదారాబాద్, అక్టోబర్ 02(ప్రజావినికిడి):**
తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరు మరింత తీవ్రమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లోనే భారీ బహిరంగ సభ నిర్వహించి, కాంగ్రెస్ ప్రభుత్వానికి సవాల్ విసురుతామని బీఆర్ఎస్ ప్రకటించింది.
హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి మిగతా 2లో...



# రాష్ట్రంలో విద్యుత్ కొరత ఉండదు

**19,000 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు**

**కరవు పరిస్థితులపై ప్రతిపక్షాలు ఆనందం**

**మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భరోసా**

**హైదారాబాద్, అక్టోబర్ 02(ప్రజావినికిడి):**
తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ కొరత లేకుండా ప్రజలకు నిరంతరాయంగా సరఫరా అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భరోసా ఇచ్చారు. కరెంట్ కష్టాలు తలెత్తకుండా ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న అనంతరం, నల్గొండలోని తన క్యాంప్ కార్యాలయంలో మిగతాది 2లో...



# గాడ్సే భావజాలాన్ని తిప్పికొట్టాలి

(మొదటి పేజీ తరువాయి

చరిత్రను వక్రీకరించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ప్రతి ఒక్కరూ ఐక్యంగా తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఆయన శ్రద్ధాంజలి ఘటించారు. సత్యం, అహింస, శాంతి మార్గాల ద్వారా దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించేలా చేసిన గాంధీజీ ఆశయాలు సదా స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, గాంధీజీ చూపిన మార్గంలోనే తమ ప్రభుత్వం పయనిస్తోందని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా విద్యార్థులందరికీ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్యను అందించాలనే ఉద్దేశంతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల'ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. వివక్షకు తావులేని సమసమాజ నిర్మాణమే ప్రజా పాలన అంతిమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

................

# రాష్ట్రంలో విద్యుత్ కొరత ఉండదు

(మొదటి పేజీ తరువాయి

మంత్రి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఇతర రాష్ట్రాల నుంచి 19,000 మెగావాట్లకు పైగా విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో సుమారు ఐదు గంటల పాటు విద్యుత్, కరవు పరిస్థితులపైనే కూలంకషంగా చర్చించినట్లు తెలిపారు. గతంలో తాను సబ్‌స్టేషన్లలోని లాగ్‌బుక్‌లను తనిఖీ చేసినప్పుడు, కొందరు ఆపరేటర్లు విద్యుత్ సరఫరాలో జరుగుతున్న వ్యత్యాసాలను అంగీకరించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. సింగరేణి బొగ్గు లింకేజీ, నైనీ బ్లాక్ సమస్యలను సత్వరమే పరిష్కరించి, బొగ్గు సరఫరాను పునరుద్ధరించేలా ప్రత్యేక దృష్టి సారించమన్నారు. నల్గొండ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి ద్వారా నియోజకవర్గానికి 5,000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు నెలకొనడంపై ప్రతిపక్షాలు రాజకీయానందం వ్యక్తం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధిస్తారని కోమటిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి హరీశ్ రావు లేఖ

(మొదటి పేజీ తరువాయి

ద్వారా విక్రయించి నిధులు సమీకరించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంలో కాంగ్రెస్ జాతీయ నాయకత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ప్రజాధనంతో నిర్మితమైన టీజీ ట్రాన్స్‌కో, రాష్ట్ర విద్యుత్ సరఫరా వ్యవస్థకు వెన్నెముక వంటిదని హరీశ్ రావు తన లేఖలో పేర్కొన్నారు. వేలాది కిలోమీటర్ల మేర విస్తరించిన విద్యుత్ లైన్లు, హై-వోల్టేజ్ సబ్‌స్టేషన్లతో కూడిన ఈ సంస్థ అత్యంత విలువైన ఆస్తి అని వివరించారు. ట్రాన్స్‌కోలో ప్రైవేట్ వాటాలకు అనుమతినిస్తే, భవిష్యత్తులో టీజీ జెన్‌కో, సింగరేణి, డిస్కమ్‌ల ప్రైవేటీకరణకు కూడా ఇది మార్గం సుగమం చేస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం కాంగ్రెస్ పార్టీ 2019 ఎన్నికల మేనిఫెస్టో, 2023 రాయ్‌పూర్ తీర్మానాలకు విరుద్ధమని హరీశ్ రావు ప్రశ్నించారు. వ్యూహాత్మకంగా ప్రాధాన్యత లేని, నష్టాల్లో ఉన్న సంస్థల్లో మాత్రమే పెట్టుబడుల ఉపసంహరణకు కట్టుబడి ఉన్నామని గతంలో కాంగ్రెస్ ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం ఎల్‌ఐసీ వంటి సంస్థలను ప్రైవేటీకరిస్తుంటే తీవ్రంగా వ్యతిరేకించిన కాంగ్రెస్, రాష్ట్రంలో అధికారంలోకి రాగానే అందుకు భిన్నంగా వ్యవహరించడం ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని నిలదీశారు. విద్యుత్ సంస్థల యాజమాన్య హక్కులపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

కాగా, ప్రైవేటీకరణ, వాటాల విక్రయం లేదా పబ్లిక్ ఇష్యూపై ఇప్పటి వరకు ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని టీజీ ట్రాన్స్‌కో వర్గాలు వెల్లడించాయి.

# హాకీలో స్వర్ణం



(మొదటి పేజీ తరువాయి

ఆ తర్వాత చైనా గోల్ కోసం తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ, భారత రక్షణ శ్రేణి గోడలా నిలిచింది. ముఖ్యంగా, గోల్ కీపర్ సవితా పూనియా ఒక కీలకమైన పెనాల్టీ స్ట్రోక్‌ను అడ్డుకుని జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. చివరి నిమిషం వరకు ఆధిక్యాన్ని కాపాడుకున్న భారత అమ్మాయిలు చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేశారు.భారత మహిళల హాకీ జట్టుకు ఆసియా క్రీడల్లో ఇది రెండో స్వర్ణం మాత్రమే. చివరిసారిగా 1982లో న్యూఢిల్లీలో జరిగిన ఆసియా గేమ్స్‌లో భారత్ స్వర్ణం సాధించింది. మళ్లీ ఇన్నేళ్లకు ఆ ఘనతను పునరావృతం చేసింది. ఈ విజయంతో భారత జట్టు 2028లో జరగనున్న లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించడం మరో విశేషం. ఈ టోర్నీలో అద్భుత ప్రదర్శన కనబరిచిన భారత జట్టు, ఫైనల్‌కు ముందు సెమీఫైనల్లో దక్షిణ కొరియాపై 2-0 తేడాతో గెలిచిన విషయం తెలిసిందే. ఈ చారిత్రాత్మక విజయంపై క్రీడా లోకం హర్షం వ్యక్తం చేస్తోంది. కాగా, తాజా స్వర్ణంతో ఈ ఆసియా క్రీడల్లో భారత్ బంగారు పతకాల సంఖ్య 16కి పెరిగింది.

# కొడంగల్‌లో సభ పెడతాం

(మొదటి పేజీ తరువాయి

తలసాని శ్రీనివాస్ యాదవ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "కొడంగల్‌లో మేము పెట్టబోయే సభతో ముఖ్యమంత్రికి చెమటలు పట్టిస్తాం" అని ఆయన హెచ్చరించారు. సిద్దిపేటలో సీఎం రేవంత్ రెడ్డి సభ ముగిసిన తర్వాత కొడంగల్‌లో బీఆర్ఎస్ సభ ఉంటుందని తలసాని స్పష్టం చేశారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి... బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియోజకవర్గమైన సిరిసిల్లలో సభ నిర్వహించడాన్ని ఆయన ప్రస్తావించారు. సిరిసిల్ల ఏమైనా పక్క రాష్ట్రంలో ఉందా? అని ప్రశ్నిస్తూ... సిరిసిల్లలో బలప్రదర్శన చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఆ సభ వల్ల సీఎంకు రాజకీయంగా నష్టమే జరిగిందని అన్నారు. ఇదే సందర్భంగా, ఖైరతాబాద్ ఉపఎన్నికపై తలసాని పూర్తి ధీమా వ్యక్తం చేశారు. ఆ ఎన్నికలో బీఆర్ఎస్ వందకు వంద శాతం గెలుస్తుందని జోస్యం చెప్పారు. పార్టీ మారిన దానం నాగేందర్‌పై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, ఈసారి ఓటింగ్ శాతం కూడా పెరుగుతుందని అన్నారు. డబ్బులు ఇచ్చినా ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేయరని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ నుంచి తమ పార్టీ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడాన్ని కూడా తలసాని తప్పుబట్టారు. సభలో తాము చేయని దానికి, బయట జరిగిన వివాదానికి స్పీకర్‌కు ఏం సంబంధమని ఆయన ప్రశ్నించారు.

# గాంధీ ఆరాధించిన రాముడు ధనికుల దేవుడా

(మొదటి పేజీ తరువాయి

నివాళులు అర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గాంధీ వారసత్వం తమదేనని చెప్పుకునే నైతిక అర్హత ఆ పార్టీలకు లేదని ఆయన విమర్శించారు. శ్రీరాముడిని "ధనికుల దేవుడు"గా అభివర్ణించిన కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.నిత్యం 'రామ' నామాన్ని జపించిన గాంధీ ఆరాధించిన రాముడు, కేవలం ధనికులకే దేవుడా, లేక ప్రజలందరి దేవుడా? అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా కాంగ్రెస్ నేతలను బండి సంజయ్ ప్రశ్నించారు. గాంధీజీ సత్యం, ధర్మం, న్యాయంతో కూడిన సనాతన ధర్మాన్ని పాటించారని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్, వారసత్వ రాజకీయాలు, అవినీతి, హిందూత్వ వ్యతిరేకత విధానాలతో నడిచే "ఇటలీ నేషనల్ కాంగ్రెస్" అని, దీనిని నడిపిస్తున్నది "డూప్లికేట్ గాంధీ కుటుంబం" అని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, ప్రజల దృష్టిని మళ్లించేందుకే హిందూ సమాజాన్ని విభజించే కుట్రలు చేస్తోందని విమర్శించారు.మరోవైపు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కూడా బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమై గాంధీ, అంబేద్కర్ వంటి జాతీయ నేతల జయంతి కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారని విమర్శించారు. ఎన్నికల్లో ఓటమి అనంతరం ప్రజా జీవితానికి దూరమైన కేసీఆర్, ప్రపంచంలోనే అత్యంత అహంకారపూరిత నాయకుడని దుయ్యబట్టారు. గాంధీ కలలు కన్న రామరాజ్యం, స్వచ్ఛ భారత్ వంటి ఆశయాలను ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం నెరవేరుస్తోందని, గాంధీకి నిజమైన వారసులు తామేనని ఆయన స్పష్టం చేశారు.

త్వరలో జరగనున్న ఖైరతాబాద్ అసెంబ్లీ ఉపఎన్నికను ప్రస్తావిస్తూ, ఈ ఎన్నిక రావడానికి కాంగ్రెస్ పార్టీయే కారణమని సంజయ్ ఆరోపించారు. ఆ నియోజకవర్గంలోని 2 లక్షల మంది హిందూ ఓటర్లను విస్మరించి, కేవలం 32,000 ముస్లిం ఓట్లపైనే కాంగ్రెస్ ఆశలు పెట్టుకుందని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కలిసినా ప్రజలు వారిని తిరస్కరిస్తారని, ఖైరతాబాద్‌లో హిందూ ఓటర్లను ఏకం చేసి బీజేపీని గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. "డబుల్ ఇంజిన్" సర్కారుతోనే తెలంగాణ సమగ్రాభివృద్ధి సాధ్యమని ఆయన పునరుద్ఘాటించారు.

# మీరు నా ఆరాధ్య దైవం

## మోదీతో అంటూ స్మిత్ భావోద్వేగం

**అక్టోబర్ 02(ప్రజావినికిడి):**
విమానంలో తోటి పైలట్ దాడిని ఎదుర్కొని, 174 మందికి పైగా ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన ఫ్లైదుబాయ్ విమాన కెప్టెన్ స్మిత్ మచ్చర్‌తో భారత ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ఫోన్‌లో మాట్లాడారు. ప్రస్తుతం యూఏఈలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న స్మిత్ యోగక్షేమాలను ప్రధాని అడిగి తెలుసుకున్నారు.

ఆయన ధైర్యసాహసాలను కొనియాడుతూ, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రధాని నుంచి ఫోన్ కాల్ రావడంతో స్మిత్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తనకు అతిపెద్ద ఆరాధ్య దైవం, ఆదర్శప్రాయుడు ప్రధాని మోదీయేనని, ఆయనతో మాట్లాడే అవకాశం వస్తుందని కలలో కూడా ఊహించలేదని ఆనందం వ్యక్తం చేశారు.

దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కాక్‌పిట్‌లో ఉన్న కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై తోటి పైలట్ కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడి కుప్పకూలినప్పటికీ, స్మిత్ అసామాన్యమైన ధైర్యాన్ని ప్రదర్శించారు. చివరి క్షణంలో కాక్‌పిట్ డోర్ లాచ్‌ను నొక్కి తలుపు తెరిచారు.

దీంతో ప్రయాణికులు వెంటనే లోపలికి ప్రవేశించి, దాడి చేస్తున్న పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు. స్మిత్ సమయస్ఫూర్తి వల్ల 9/11 తరహా పెను ప్రమాదం తప్పిందని, 174 మందికి పైగా సురక్షితంగా బయటపడ్డారని ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రధానితో సంభాషణ సందర్భంగా స్మిత్ ఒక ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. తాను కష్ట సమయాల్లో ఉన్నప్పుడు హనుమాన్ చాలీసా పఠిస్తానని, విమానంలో దాడి జరిగినప్పుడు కూడా ప్రాణాలతో పోరాడుతూ హనుమాన్ చాలీసానే చదువుకున్నానని వివరించారు.

అనంతరం ప్రధాని మోదీ, స్మిత్ తల్లి గీతా బెన్‌తో కూడా మాట్లాడారు. భగవద్గీత విలువలు, బోధనలతో కుమారుడిని పెంచినందుకు ఆమెను అభినందించారు. స్మిత్ త్వరగా కోలుకోవడానికి అవసరమైన వైద్య సహాయంతో పాటు అన్ని విధాలుగా కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రధాని మోదీ వారి కుటుంబానికి భరోసా ఇచ్చారు.

# కరవుసీమ ఇకపై కనకసీమ

(మొదటి పేజీ తరువాయి



అన్నమయ్య జిల్లా మదనపల్లెలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి 'రాయలసీమ హార్టికల్చర్ హబ్', 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్'లకు ఆయన శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. సాగునీరు అందిస్తే సీమ రైతులు బంగారం పండిస్తారని అన్నారు. రూ. లక్ష కోట్ల పెట్టుబడితో రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేసే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, కరవు సీమ ఇకపై కనకసీమగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. 2026 అక్టోబర్ 2వ తేదీ ఈ ప్రాంత చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అదనంగా ఆరు లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలను విస్తరిస్తామని, ఈ హబ్ ద్వారా పంటల ఉత్పత్తి, ధరల స్థిరీకరణ సాధ్యమవుతుందని వివరించారు.

ఎన్టీ రామారావు ప్రారంభించిన సాగునీటి ప్రాజెక్టులను ముందుకు తీసుకెళుతున్నామని, హంద్రీనీవా లేకపోతే మదనపల్లె ప్రాంతం వలసలతో ఖాళీ అయ్యేదని గుర్తుచేశారు. మూడేళ్లలో రూ.35,000 కోట్లతో 36 ప్రాజెక్టులను పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. హంద్రీనీవా ఫేజ్-2, వెలిగొండ ఫేజ్-2, మడకశిర బ్రాంచ్ కెనాల్ విస్తరణ పనులను పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీని 'ఆంధ్రా బిడ్డ' అని అభివర్ణించిన చంద్రబాబు, తిరుమలకు ఉచితంగా ఎలక్ట్రిక్ బస్సులు అందించడంపై ప్రశంసించారు. పోలవరం ప్రాజెక్టు పనులు వేగంగా సాగుతున్నాయని, దాన్ని కూడా పూర్తి చేసి ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభిస్తామని తెలిపారు.

## రాయలసీమ రైతుల తల రాతలు మారబోతున్నాయి: పవన్ కల్యాణ్

రాయలసీమను ప్రపంచ స్థాయి ఉద్యాన కేంద్రంగా (గ్లోబల్ హార్టికల్చర్ హబ్) తీర్చిదిద్దే ప్రాజెక్టుకు శుక్రవారం అంకురార్పణ జరిగింది. మదనపల్లెలో 'రాయలసీమ రైజింగ్' పేరుతో చేపట్టిన ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ... రూ. లక్ష కోట్ల పెట్టుబడితో చేపడుతున్న ఈ ప్రాజెక్టుతో రాయలసీమ రైతుల తలరాతలు మారబోతున్నాయని, ఇది ఒక చరిత్రాత్మక ఘట్టమని అన్నారు. కష్టపడి పనిచేసే సీమ రైతులకు ప్రభుత్వం అండగా నిలిచి, సాంకేతికతను అందిస్తే అద్భుతాలు సృష్టిస్తారని కొనియాడారు. హార్టికల్చర్ హబ్‌తో పాటు, అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేయనున్న ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు కూడా పునాదిరాయి వేశామన్నారు.

ఈ ప్రాజెక్టు ద్వారా సీమలోని కరవు పీడిత ప్రాంతాల్లో ఉద్యాన పంటల సాగును గణనీయంగా పెంచుతామని, సూక్ష్మ సేద్యం ద్వారా నీటి సంరక్షణకు పెద్దపీట వేస్తామని పవన్ తెలిపారు. రైతులు పండించే నాణ్యమైన పంటలకు అంతర్జాతీయ మార్కెట్ కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ మెగా ప్రాజెక్టులతో రాయలసీమ జిల్లాల్లోని లక్షలాది మంది రైతులకు స్థిరమైన ఆర్థిక భద్రత లభిస్తుందని... ఈ ప్రాజెక్టు దేశ వ్యవసాయ రంగంలోనే ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## సీఎం చంద్రబాబు గారూ.. 'నన్ను ఆంధ్రా బిడ్డగా భావించండి.. రాష్ట్రానికి ఏం చేయగలనో చెప్పండి': అనంత్ అంబానీ

రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ ఆంధ్రప్రదేశ్ ప్రజల పట్ల తనకున్న అభిమానాన్ని, రాష్ట్ర అభివృద్ధికి చేయూతనివ్వాలన్న తన సంకల్పాన్ని బలంగా చాటిచెప్పారు. "నన్ను మీ ఆంధ్ర బిడ్డగా భావించండి. రాష్ట్రానికి నేనేం చేయాలో, ఏ సేవ అందించాలో మీరే మార్గనిర్దేశం చేయండి" అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ఆయన వినమ్రంగా కోరారు.

గ్లోబల్ హార్టికల్చర్ హబ్, 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్' (ఐఎస్ఏ) శంకుస్థాపన కార్యక్రమంలో అనంత్ అంబానీ చేసిన ప్రసంగం సభికులను, వేదికపై ఉన్న ప్రముఖులను విశేషంగా ఆకట్టుకుంది. ఆయన ప్రసంగం ముగిసిన వెంటనే సీఎం చంద్రబాబు అనంత్‌ను ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని అభినందించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, డిప్యూటీ సీఎం



పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ కూడా ఆయన ప్రసంగాన్ని ప్రశంసించారు.

ఈ సందర్భంగా అనంత్ అంబానీ మాట్లాడుతూ.. రాయలసీమలో ఏర్పాటవుతున్న హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. "ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) తరహాలోనే ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ కూడా ఉన్నత ప్రమాణాలతో ఎదుగుతుంది. ఈ సంస్థ ద్వారా అన్నదాతలను వారి కమతాలకే సీఈఓలుగా మారుస్తాం. ఆంధ్రభూమి స్వర్ణభూమిగా మారడం ఖాయం" అని ఆయన అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కలలుగన్న 'వికసిత్ భారత్' స్వప్నాన్ని తనలాంటి యువత సాకారం చేసి చూపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ప్లాంట్ల ఏర్పాటుకు దేశవ్యాప్తంగా రూ.1 లక్ష కోట్లు పెట్టుబడి పెడుతున్నట్లు వెల్లడించారు. 'కియో కృషి' ద్వారా రైతులకు జియో పూర్తి సహకారం అందిస్తుందని, 'దేశ్ సేవా-కిసాన్ సేవా' తమ నినాదమని స్పష్టం చేశారు. 'పశు సేవా హీ ప్రభు సేవా' అని తాను విశ్వసిస్తానని, 'వంతారా' ద్వారా జంతు సంరక్షణకు తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. ఏపీలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అద్భుతంగా ఉందని, అందుకే రాష్ట్రం పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షిస్తోందని కొనియాడారు.

# డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా అల్పాహార పథకం

(మొదటి పేజీ తరువాయి

మద్దతుగా జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థలు ముందుకొచ్చాయి. నాగర్‌కర్నూల్‌లో కిచెన్ ఏర్పాటుకు జున్నా సోలార్ సిస్టమ్స్ తరఫున సీఎండీ శేఖర్ రెడ్డి, సీఈఓ అనిల్ బాబు రూ. 5.17 కోట్ల చెక్కును, వికారాబాద్‌లో కిచెన్ ఏర్పాటుకు చైన్ ల్యాబ్స్ ఇండియా తరఫున ప్రతినిధి డి. సుమంత్, వైస్ ప్రెసిడెంట్ బుగత సంతోష్ కుమార్ రూ. 4 కోట్ల చెక్కును ముఖ్యమంత్రి చేతుల మీదుగా హరేకృష్ణ ఫౌండేషన్‌కు అందజేశారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు అందించే ఆహారంలో కేలరీలను లెక్కించేందుకు ప్రత్యేక యాప్‌లను వినియోగించాలని సూచించారు. స్థానిక ఆహారపు అలవాట్లకు అనుగుణంగా మెనూ ఉండాలని, ఆహార నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం దీర్ఘకాలం కొనసాగేలా సెంట్రల్ కిచెన్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించాలని ఆదేశించారు. విద్యార్థుల్లో పోషకాహారం విలువలను పెంచి, హాజరుశాతాన్ని మెరుగుపరచడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, హరేకృష్ణ ఫౌండేషన్ ప్రతినిధి సత్య గౌర చంద్రదాస్ స్వామీజీ తదితరులు పాల్గొన్నారు.

# మొదల్లగూడ లో తహసీల్దార్, ఇరిగేషన్ శాఖ అధికారుల పరిశీలన..

**వాగును ఆక్రమించిన సింబాయాసిస్ యూనివర్సిటీకి తహసీల్దార్ హెచ్చరిక.. -వాగులు,పాటుకాలువను ఆక్రమిస్తే సహించేది లేదు..!**

**ప్రజావినికిడి దిన పత్రిక వార్త కథనానికి కదిలిన రెవిన్యూ,ఇరిగేషన్ శాఖ అధికారులు..**









నీటి ప్రవాహానికి అడ్డుగా నిర్మించిన గోడను పరిశీలిస్తున్న అధికారులు

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం నందిగామ మండలం మొదల్లగుడ గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 272,292లో పాటుకాలువలు,చెరువులకు అడ్డుగా నిర్మాణాలు చేపడుతున్నారంటూ వచ్చిన "ప్రజావినికిడి" దినపత్రికలో ప్రచురితమైన వార్త కథనానికి అధికారులు స్పందించారు.

### ప్రజావినికిడి దిన పత్రిక వార్త కథనానికి స్పందించిన రెవెన్యూ,ఇరిగేషన్ శాఖ అధికారులు..

నందిగామ మండలం తహసీల్దార్ సైదులు,ఇరిగేషన్ ఏఈ ఆదిత్య,ఆర్ఐ రామచందర్ ఆక్రమణలకు గురైన ప్రాంతాలను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు.మొదల్లగూడ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 272లో బొల్లం చెరువు ఆక్రమణకు గురైందన్న ఆరోపణలపై అధికారులు పరిశీలన చేపట్టారు.చెరువు కట్టపై ఫెన్సింగ్ ఏర్పాటు చేసినట్లు గుర్తించామని తహసీల్దార్ సైదులు తెలిపారు.చెరువు కట్టపై నిర్మాణాలు చేపట్టే ముందు నిబంధనల ప్రకారం బఫర్ జోన్ వదలాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

**ప్రజావినికిడి ఎఫెక్ట్**

### చెరువు కట్టమట్టి తరలింపు సరికాదు

చెరువు కట్టను ధ్వంసం చేసి భారీగా మట్టిని తరలించి నిర్మాణాలు చేపట్టడం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు.నిబంధనలకు విరుద్ధంగా ఫెన్సింగ్ లేదా ఇతర నిర్మాణాలు చేపట్టినట్లయితే వాటిని తొలగించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.చెరువు వెనుక భాగంలో,బొల్లం చెరువు పరిధిలో నిర్మించిన గోడలు తదితర నిర్మాణాలను కూడా పరిశీలించి,నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటిని తొలగించాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. సర్వే నంబర్ 272లో పూర్తిస్థాయి సర్వే నిర్వహించిన అనంతరం అక్రమ నిర్మాణాలు ఉన్నట్లు తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సైదులు తెలిపారు.

**వాగుల విషయంలోనూ నిబంధనలు తప్పనిసరి**

వాగులు,పాటుకాలువలకు సంబంధించి రెవెన్యూ మ్యాప్‌తో పాటు ఇరిగేషన్ మ్యాప్‌ను పరిశీలించి నిబంధనల ప్రకారం హద్దులను నిర్ధారిస్తామని అధికారులు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టినట్లు తేలితే చర్యలు తప్పవని హెచ్చరించారు.



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక
www.prajavinikidi.com
29 Sep 2026 - Page 6

## సింబయోసిస్ వర్సిటీ వద్ద కబ్జా కోరలు

పెద్దవాగు పాటుకాలువకే ఎసరు..
మొదల్లగూడలో నీటి ప్రవాహానికి అడ్డుకట్ట..
బొల్లం చెరువు కట్ట ధ్వంసమని బక్కని ఆగ్రహం.!
వాగులు,కాలువలపై కబ్జాదారుల కన్ను.. బక్కని క్షేత్రస్థాయి పరిశీలన..!

**షాద్ నగర్, సెప్టెంబర్ 28,**
(ప్రజావినికిడి ):వాగులు, కాలువలపై కబ్జాదారుల కన్ను పడిందని ఆరోపిస్తూ నందిగామ మండలం మొదల్లగూడ గ్రామంలో టీడీపీ జాతీయ పొలిట్‌బ్యూరో సభ్యుడు, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు.సర్వే నంబర్ 292లోని పాటుకాలువకు అడ్డంగా నిర్మాణాలు వెలిశాయని, పెద్దవాగు, ఈదులవాగు నుంచి బొల్లం చెరువుకు చేరాల్సిన నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు.వాగులు, కాలువలు, చెరువులు సహజ నీటి ప్రవాహానికి మార్గాలని, వాటిని అడ్డుకునే నిర్మాణాలతో భవిష్యత్తులో సాగు, తాగునీటికి ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని బక్కని నరసింహులు అన్నారు.కొన్ని చోట్ల నీటి ప్రవాహం భవనాల కిందుగా వెళ్లేలా నిర్మాణాలు ఉన్నాయని ఆరోపించారు.2008 జూన్ 11న జారీ చేసిన జీవో నంబర్ 733 ద్వారా నాటి ప్రభుత్వం 40 ఎకరాల భూమిని సింబయోసిస్ యూనివర్సిటీకి అప్పగించిందని ఆయన తెలిపారు. గతంలో గైరాన్ భూములను పేదలకు కేటాయించిన సందర్భాలు ఉన్నాయని, నిర్దిష్ట కాలం సాగు చేయకపోతే భూమిలేని వారికి కేటాయించే నిబంధనలు ఉన్నాయని పేర్కొన్నారు.బొల్లం చెరువు కట్టను ధ్వంసం చేసి మట్టిని తరలించారని బక్కని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంపన్నులు భూముల కోసం దరఖాస్తు చేసుకుంటే పేదల ప్రయోజనాలను పక్కనపెట్టి అధికారులు సులభంగా ఎన్‌ఓసీలు ఇస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయని అన్నారు.

వాగులో బహుళ అంతస్తుల భవన నిర్మాణం

**ప్రజావినికిడి లో ప్రచురితమైన కథనం**

### వాగు పై ప్రహరీ నిర్మించిన సింబాయాసిస్ యూనివర్సిటీకి అధికారుల హెచ్చరిక

సర్వే నంబర్ 292/2లో సింబాసిస్ యూనివర్సిటీ యాజమాన్యం వాగు పరిధిని ఆక్రమించి గోడ నిర్మించిందన్న ఆరోపణలపై కూడా అధికారులు పరిశీలించారు.నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ప్రహరీ గోడను తక్షణమే ఆక్రమణదారులు తొలగించుకోవాలని సూచించారు.లేనిపక్షంలో నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సైదులు హెచ్చరించారు.

### స్వార్థ ప్రయోజనాల కోసం జలవనరులను చెరపెట్టరాదు

వాగులు,కుంటలు,చెరువులను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తహసీల్దార్ పేర్కొన్నారు.స్వార్థ ప్రయోజనాల కోసం జలవనరుల పరిధిలో అక్రమ నిర్మాణాలు చేపట్టవద్దని ప్రజలకు సూచించారు.చట్టాన్ని అధిక్రమించి ఎవరు కబ్జాలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేయబడతాయని సూచించారు.బక్కని నరసింహులు మాట్లాడుతూ,అధికారుల పర్యవేక్షణ పై స్పందించిన షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు అధికారులు పర్యవేక్షణలకే పరిమితం కాకుండా వాగులు,కుంటలు, చెరువులను,కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకొని,వాగు పై నిర్మించిన ఆక్రమణలను తొలగించి ప్రకృతివనరులను పరిరక్షించాలని అధికారులను కోరారు.

# గాంధీజీ చూపిన సత్యం,అహింస, శాంతి మార్గాలు ఆచరణీయం..

**ప్రజాసేవలో నిజాయితీ, బాధ్యత, పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలి..**

**రంగారెడ్డిజిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి..**





**రంగారెడ్డి,(ప్రజావినికిడి):**
జాతిపిత మహాత్మా గాంధీజీ చూపిన సత్యం,అహింస, శాంతి, సత్యాగ్రహ మార్గాలు నేటి సమాజానికి కూడా ఎంతో ఆచరణీయమైనవని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. గాంధీజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సమాజంలో శాంతి, సామరస్యం, సోదరభావం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు.జాతిపిత మహాత్మా గాంధీజీ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, భారతదేశ స్వాతంత్ర్య సాధనలో మహాత్మా గాంధీజీ కీలక పాత్ర పోషించారని తెలిపారు. ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చి, సత్యం,అహింస, సత్యాగ్రహం వంటి సిద్ధాంతాల ఆధారంగా స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించారని పేర్కొన్నారు. ఎటువంటి హింసకు తావులేకుండా నైతిక విలువలు, శాంతియుత పోరాటం ద్వారా లక్ష్యాన్ని సాధించవచ్చని గాంధీజీ ప్రపంచానికి చాటి చెప్పారని అన్నారు.

గాంధీజీ జీవితమే ఒక సందేశమని కలెక్టర్ అన్నారు. సత్యనిష్ఠ, అహింస, నిరాడంబర జీవనం, క్రమశిక్షణ, దేశభక్తి,సేవా భావం వంటి విలువలను ఆయన తన జీవితంలో ఆచరించి చూపారని తెలిపారు.ఈ విలువలు కేవలం స్వాతంత్ర్య ఉద్యమ కాలానికే పరిమితం కాకుండా,నేటి సమాజంలోనూ ప్రతి ఒక్కరి వ్యక్తిగత మరియు సామాజిక జీవితంలో మార్గదర్శకంగా నిలవాలని అన్నారు.ప్రజాసేవలో ఉన్న ప్రతి ఒక్కరూ గాంధీజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో అందేలా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని అన్నారు.ప్రజల సమస్యలను సానుభూతితో విని,నిబంధనల మేరకు వేగంగా పరిష్కరించడం ద్వారా ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకాన్ని మరింత పెంపొందించవచ్చని పేర్కొన్నారు.

సమాజంలో శాంతి, సామరస్యం, పరస్పర గౌరవం, సోదరభావం మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని కలెక్టర్ అన్నారు. కుల,మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా ప్రజలందరూ ఐక్యతతో ముందుకు సాగాలని సూచించారు. పరస్పర సహకారం, మానవతా విలువలు, సామాజిక బాధ్యతను పెంపొందించుకోవడం ద్వారా బలమైన సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు.గాంధీజీ కలలు కన్న స్వచ్ఛమైన భారతదేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల్లో ప్రజలు చురుకుగా భాగస్వామ్యం కావాలని అన్నారు. స్వచ్ఛతను కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా రోజువారీ జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు.

మహాత్మా గాంధీజీ చూపిన మార్గంలో నడుస్తూ నిజాయితీ, కర్తవ్యనిబద్ధత, సేవా భావం, సామాజిక బాధ్యత వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని జిల్లా కలెక్టర్ కోరారు.గాంధీజీ ఆశయాలను భావితరాలకు అందించేందుకు విద్యార్థులు, యువత ప్రత్యేకంగా ముందుకు రావాలని అన్నారు.దేశ అభివృద్ధి, సమాజ సంక్షేమం కోసం ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించినప్పుడే గాంధీజీ కలలు కన్న సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది,ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చలో ఓయూ విజయవంతం చేయాలి..

**అణగారిన వర్గాల విద్యార్థులకు ఎంఎస్ఎఫ్ ఆశాకిరణంగా నిలవాలి:పంగ ప్రణయ్ కుమార్ మాదిగ..**



**హైదరాబాద్,(ప్రజావినికిడి):**
అక్టోబర్ 6న ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించనున్న ఎంఎస్ఎఫ్ జాతీయ ప్రతినిధుల సదస్సును విజయవంతం చేయాలని ఎంఆర్పీఎస్ జిల్లా మాజీ అధ్యక్షులు పంగ ప్రణయ్ కుమార్ మాదిగ పిలుపునిచ్చారు. మేడిపల్లి మండల కేంద్రంలో మండల ఎంఆర్పీఎస్ అధ్యక్షుడు కాటపాక అభిషేక్ మాదిగ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశానికి ముఖ్య అతిథిగా పంగ ప్రణయ్ కుమార్ మాదిగ హాజరై మాట్లాడుతూ, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో నిర్వహించనున్న ఈ జాతీయ ప్రతినిధుల సదస్సు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకే పరిమితం కాకుండా జాతీయ స్థాయిలో విద్యార్థి సమస్యలపై ప్రభావం చూపేలా నిర్వహించాలని అన్నారు. అణగారిన వర్గాల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై గళం విప్పే బలమైన విద్యార్థి శక్తిగా ఎంఎస్ఎఫ్ నిలవాలని ఆకాంక్షించారు. పీడిత వర్గాల విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేసే పాలకులకు ఈ సదస్సు ఒక హెచ్చరికగా నిలవాలని అన్నారు.ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ విద్యార్థులకు బలమైన వేదికగా ఎంఎస్ఎఫ్, ఎంఎస్ యు భవిష్యత్తులో ఎదగాలని, అందుకు జాతీయ ప్రతినిధుల సదస్సును అత్యంత విజయవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. మేడిపల్లి మండలం నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉస్మానియా యూనివర్సిటీకి తరలివచ్చి చలో ఓయూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు బండారి సాయి మాదిగ, మైసగాళ్ల శివ మాదిగ,కూతాడి సంపత్,మండల ప్రధాన కార్యదర్శి సి హెచ్ శివ, మండల ఉపాధ్యక్షులు ఉపేంద్ర,విక్రమ్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు

# ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగుతుంది

## అధ్యక్షులు గిరి యాదయ్య



**హైదరాబాద్, (ప్రజావినికిడి):** ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగుతుందని ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులుగా గిరి యాదయ్య అన్నారు. తెలంగాణ రాజీవ్ ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశాన్ని శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి 33 జిల్లాల నుండి అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్ భూపాల్ పాల్గొని ప్రసంగించారు. అనంతరం నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. మరోసారి ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులుగా గిరి యాదయ్యను కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షులుగా సుమన్,వర్కింగ్ ప్రెసిడెంట్ విష్ణు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా రాజు,కుమార్, రాష్ట్ర కోశాధికారిగా రత్నం, ఉపాధ్యక్షులుగా కిషోర్,రవీందర్, సురేష్,సంపత్, లిల్లి పుష్ప,రాష్ట్ర సహాయ కార్యదర్శిగా గోలి నాగరాజు, జయరాం, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రమేష్, రాష్ట్ర కమిటీ సభ్యులుగా రమణ,శ్రీశైలం తదితరులను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికైన గిరి యాదయ్య మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ పరిధిలో పని చేస్తున్న ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సమస్యలపై నిరంతరం తమ పోరాటం కొనసాగుతుందని. తమ న్యాయపరమైన డిమాండ్లు నెరవేర్చే వరకు ఎక్కడ వెనుకడుగు వేసేది లేదని తేల్చి చెప్పారు. ఆరోగ్యశ్రీ ట్రస్టు పరిధిలో పనిచేస్తున్న ఎందరో పేద ప్రజలకు శక్తికి మించి సేవ చేస్తున్న తమను ప్రభుత్వం గుర్తించి తక్షణమే ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# గాంధీ జయంతి నాడు మద్యం అమ్మకాలు జరుపుతున్న వ్యక్తులపై దాడి

## 17.22 లీటర్ల ఐఎంఎల్,4.550 లీటర్ల బీర్ను స్వాధీనం



**నాంపల్లి, (ప్రజావినికిడి):**
హైదరాబాద్ ఎన్ఫోర్స్మెంట్ సీఐ భరత్ భూషణ్, ఎస్ఐ శ్రీనివాసరెడ్డి సిబ్బంది కలిసి రాజేంద్రనగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో గాంధీ జయంతి సందర్భంగా మద్యం అమ్మకాలు జరుగుతున్నారనే సమాచారం మేరకు ఎన్ఫోర్స్మెంట్ టీం దాడులు నిర్వహించారు. 17.22 లీటర్ల ఐఎంఎల్, 4.550 లీటర్ల బీరును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ భరత్ భూషణ్ తెలిపారు. పట్టుకున్న మద్యాన్ని రాజేంద్రనగర్ ఎక్సైజ్ స్టేషన్ లో అప్పగించారు. ఇదే టీం సికింద్రాబాద్ ఏరియాలో డిఫెన్స్ మద్యం బాటిల్లను అమ్మకాలు జరుపుతుండగా 17మద్యం బాటిల్లను సీజ్ చేసినట్లు సిఐ భరత్ భూషణ్ తెలిపారు. మద్యం బాటిల్లను సికింద్రాబాద్ ఎక్సైజ్ స్టేషన్ లో అప్పగించినట్లు ఆయన తెలిపారు.

# మహనీయుల విగ్రహాలనే ప్రతిష్టించాలి



**ఆబిడ్స్, (ప్రజావినికిడి):**
రాష్ట్రానికి ఎలాంటి ప్రత్యేక సేవచేయని, కనీసం తన సామాజిక వర్గానికి కూడా సేవచేయలేని వ్యక్తి విగ్రహాన్ని ప్రతిష్ఠించడం హైదరాబాద్ నగర ఔన్నత్య ప్రతిష్ఠను తక్కువ చేయడమే అవుతుంది. అలాంటి విగ్రహం ఒకటి హైదరాబాద్ నగరం నడిబొడ్డున ట్యాంక్ బండ్ పై గత ప్రభుత్వం కొందరిని సంతృప్తి పరచడానికి ఏర్పాటు చేసింది. ట్యాంక్ బండ్ పై ఉన్న గడ్డం వెంకటస్వామి (కాకా)విగ్రహం చేయని సేవకు ప్రతిబింబంగా కొందరు ఆనాటి ప్రభుత్వంపై ఆయన కుటుంబ సభ్యులు ప్రతిష్ఠింప చేసుకున్నారు. హైదరాబాద్కు సంబంధంలేని, దళిత ముసుగులో స్వార్థంతో ఒత్తిడి తెచ్చి అత్యున్నత పదవులు పొంది తరతరాలకు తరగని ఆస్తులు సంపాదించుకొని తన కొడుకులకు మాత్రమే రాజకీయ అవకాశాలు కల్పించిన స్వార్థపరుడు గడ్డం వెంకటస్వామి (కాకా)ఆయన విగ్రహంను ట్యాంక్ బండ్ నుండి తక్షణమే తొలగించాలని సెంటర్ ఫర్ బెటర్ ఇండియా రిసెర్చ్ ఫౌండేషన్ డైరెక్టర్ మామిడి నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ మహానగర సంస్థ ఆ స్థలంలో మహనీయుల విగ్రహాలను ప్రతిష్ఠించాలి. అలాంటి ప్రముఖులు భాగ్య రెడ్డి వర్మ, బియాస్ వెంకటరావు, బత్తుల శ్యాంసుందర్, యంఆర్ కృష్ణ, గూడ అంజయ్య, గద్దర్ విగ్రహాలు ప్రతిష్ఠించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ కు ఎంతో మంది సేవలను చేసిన మహనీయులున్నారని అన్నారు. అలాంటి మహనీయులని గుర్తించి వారి విగ్రహాలను ప్రభుత్వం గుర్తించి ప్రతిష్టించాలని అభిలాషించారు

# భాగ్యనగర్ స్కిల్ డెవలప్మెంట్ వింగ్ మంతెన అనిల్ కుమార్



**ఎల్బీనగర్, (ప్రజావినికిడి): అక్టోబర్ 2,** నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి భాగ్యనగర్ స్కిల్డ్ డెవలప్‌మెంట్ వింగ్‌కు చెందిన మంతెన అనిల్ కుమార్ బీజేపీ కార్మిక విభాగం రాష్ట్ర కన్వీనర్ అందె శ్రీనివాస్, శంభామూర్తి, గంటి నగేష్, ఆకుల శ్రీనివాస్‌లను కలిశారు. ఈ సందర్భంగా యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు, కార్మికుల సంక్షేమంపై చర్చించారు. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను విస్తరించి యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలని వారు పేర్కొన్నారు.

# టీఎన్జీవోస్‌లో ఘనంగా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు



**నాంపల్లి, (ప్రజావినికిడి):**
జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధాన మంత్రి లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను నాంపల్లి టీఎన్జీఓస్ యూనియన్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. టీఎన్జీఓస్ యూనియన్ కేంద్ర ప్రధాన కార్యదర్శి డా. ఎస్.ఎం.హుస్సేని ముజీబ్ మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఎస్.ఎం. హుస్సేని ముజీబ్ మాట్లాడుతూ, భారత స్వాతంత్ర్య సమరంలో మహాత్మా గాంధీ పోషించిన పాత్ర చిరస్మరణీయమని కొనియాడారు. గాంధీజీ సత్యం, అహింస,శాంతి, నైతిక విలువలను తన జీవితంలో ఆచరించి,దేశ ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చారని పేర్కొన్నారు. కుల,మత, ప్రాంత,భాష భేదాలకు అతీతంగా ప్రజలందరూ ఐక్యంగా ఉండాలని గాంధీజీ చూపిన మార్గం నేటి సమాజానికి కూడా ఎంతో అవసరమని అన్నారు. అలాగే మాజీ ప్రధాన మంత్రి లాల్ బహదూర్ శాస్త్రి దేశానికి అందించిన సేవలను గుర్తు చేశారు. నిరాడంబరమైన జీవితం, నిజాయితీ, క్రమశిక్షణ, దేశభక్తి,అంకిత భావానికి లాల్ బహదూర్ శాస్త్రి ఆదర్శప్రాయుడని అన్నారు. దేశం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో ఆయన నాయకత్వం, ధైర్యం, నిర్ణయాత్మకత దేశ ప్రజలకు స్ఫూర్తినిచ్చాయని తెలిపారు. లాల్ బహదూర్ శాస్త్రి ఇచ్చిన జై జవాన్-జై కిసాన్ నినాదం దేశ భద్రతలో సైనికులు,దేశ ఆహార భద్రతలో రైతులు అందిస్తున్న సేవల ప్రాధాన్యతను తెలియజేస్తుందని అన్నారు. దేశ అభివృద్ధిలో రైతులు, సైనికులు, ఉద్యోగులు, కార్మికులు ప్రతి ఒక్కరి పాత్ర ఎంతో కీలకమన్నారు. గాంధీజీ,లాల్ బహదూర్ శాస్త్రి చూపిన విలువలను నేటి యువత ఆదర్శంగా తీసుకొని దేశ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ, ప్రజలకు అంకితభావంతో సేవ చేయడం ద్వారా వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓస్ యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షులు కొండల్ రెడ్డి, కార్యదర్శి శైలజ, టీఎన్జీఓస్ యూనియన్ హైదరాబాద్ సిటీ అధ్యక్షులు శ్రీకాంత్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు అసదుద్దీన్, ట్రెజరర్ అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్,టీఎన్జీఓస్ యూనియన్ హైదరాబాద్ అసోసియేట్ ప్రెసిడెంట్ కె.ఆర్.రాజ్‌కుమార్,ఉపాధ్యక్షులు ఖలీద్,బొలిగిద్ద శంకర్, టీఎన్జీఓస్ యూనియన్ ఐటీఐ ఫోరం అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి, యూనియన్ హైదరాబాద్ ఈసీ సభ్యులు ముఖీద్ ఖురేషీ, ఏపీఆర్వో వహీద్, టీఎన్జీఓస్ యూనియన్ ఐటీఐ యూనిట్ అధ్యక్షులు సత్యనారాయణ, ఎక్సైజ్ డిపార్టుమెంట్ కృష్ణ,స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ రోహిత్,మధు, ఉస్మాన్, రామకృష్ణ, మహమ్మద్ తదితరులు పాల్గొని మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు నివాళు లర్పించారు.

# జాతీయ జనగణనలో ఓబీసీ కులగణన చేపట్టాలి

## అక్టోబర్ 4న శంషాబాద్‌లో నిర్వహించే ఓబీసీ ల బహిరంగ సభను విజయవంతం చేయాలి..

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్




**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
శంషాబాద్‌లో అక్టోబర్ 4న టీపీసీసీ ఓబీసీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఓబీసీల భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. నేడు గాంధీ భవన్ లో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య,ఎమ్మెల్యే నవీన్ యాదవ్,ఏఐసీసీ నేషనల్ కోఆర్డినేటర్,తెలంగాణ ఇన్‌చార్జ్,ఛత్తీస్‌గఢ్ మాజీ ఎమ్మెల్యే లెక్రామ్ సాహు,ఓబీసీ స్టేట్ కోఆర్డినేటర్ కేతూరి వెంకటేష్,ధనలక్ష్మి,మాజీ ఎంపీపీ శివశంకర్ లతో కలసి ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి మాట్లాడుతూ,
దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు విద్య,ఉద్యోగ, వాణిజ్య,రాజకీయ,చట్టసభల్లో సమాన సామాజిక అవకాశాలు కల్పించినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా ఓబీసీ లకు వారి జనాభా నిష్పత్తికి అనుగుణంగా తగిన ప్రాతినిధ్యం,అవకాశాలు పూర్తిస్థాయిలో అందకపోవడం ఆందోళనకరమన్నారు. సామాజికంగా,ఆర్థికంగా వెనుకబడిన వర్గాలను అభివృద్ధి ప్రధాన స్రవంతిలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఓబీసీ ల వాస్తవ జనాభా ఎంత ఉందో స్పష్టమైన గణాంకాలు అందుబాటులో ఉండటం ద్వారా వారి సామాజిక, విద్యా,ఆర్థిక పరిస్థితులను అంచనా వేసి, అవసరమైన విధానాలు రూపొందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఓబీసీ ల న్యాయపరమైన, రాజ్యాంగబద్ధమైన హక్కుల సాధనలో భాగంగా ప్రస్తుతం నిర్వహించనున్న జాతీయ జనగణనలో ఓబిసి కులగణనను తప్పనిసరిగా చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అక్టోబర్ 4న శంషాబాద్‌లో నిర్వహించనున్న ఈ బహిరంగ సభకు ఓబిసి లు, ప్రజాప్రతినిధులు, బీసీ సంఘాల నాయకులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.

# కార్మికుల ప్రయోజనాలే పరమావధిగా కృషి చేయాలి

## ఎడవెల్లి స్వామి ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ గుట్టడిపో సెక్రటరీ



**ఎల్బీనగర్,(ప్రజావినికిడి): అక్టోబర్ 2,**
టీఎస్ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, హక్కుల పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా యూనియన్లు పనిచేయాలని ఎస్సీ,ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ డిపో కార్యదర్శి ఎడవల్లి లింగస్వామి అన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలు, గతంలో జరిగిన ఉద్యమాలు, వేతన సవరణలు, ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై కార్మికులు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.
ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి గతంలో అశ్వత్థామ రెడ్డి నాయకత్వంలో జరిగిన ఉద్యమాలు, ప్రభుత్వంతో జరిపిన చర్చలు, వేతన సవరణలు తదితర అంశాలను ఈ సందర్భంగా లింగస్వామి ప్రస్తావించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆర్టీసీ కార్మికులను సమీకరించడంలో,కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. 44 శాతం పీఆర్‌సీ, 16 శాతం ఐఆర్ వంటి అంశాలను సాధించడంలోనూ ఆయన నాయకత్వం ఉందని తెలిపారు.
ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ ఉద్యోగులకు 2013 బాండ్ బకాయిల చెల్లింపు,2017, 2021వేతన సవరణలు, డీఏల అమలు, పీఎఫ్,సీసీఎస్ రుణాల సౌకర్యం, యూనియన్ హక్కుల పునరుద్ధరణ వంటి పలు చర్యలు చేపట్టిందని లింగస్వామి పేర్కొన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.
అదేవిధంగా ఉద్యోగ భద్రతతో కూడిన సంపూర్ణ విలీనం,మాస్టర్ పే స్కేల్,తార్నాక ఆస్పత్రి కొనసాగింపు, ఎలాంటి లోటుపాట్లు లేకుండా విలీనం వంటి అంశాలపై కార్మికుల ప్రయోజనాలకు అనుగుణంగా స్పష్టమైన నిర్ణయాలు అవసరమన్నారుయూనియన్ ఎన్నికలు, విలీనం తదితర అంశాలపై కార్మిక సంఘాల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నాయని, వాటిని పక్కనపెట్టి కార్మికుల భవిష్యత్తు, సంక్షేమం కోసం సమష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందని సూచించారు.
కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, వేతనాలు, సంక్షేమం వంటి అంశాలపై నిరంతరం పోరాడే సంఘాలకు కార్మికులు మద్దతు ఇవ్వాలని లింగస్వామి కోరారు. రాజకీయ, యూనియన్ విభేదాలకు అతీతంగా కార్మికుల ప్రయోజనాలే పరమావధిగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# షాద్‌నగర్ పట్టణంలో గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..



**షాద్‌నగర్,(ప్రజావినికిడి):**
జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా షాద్‌నగర్ పట్టణంలో ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో గల గాంధీజీ విగ్రహానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాంధీజీ దేశానికి అందించిన సేవలను, స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన పోషించిన కీలక పాత్రను స్మరించుకున్నారుసత్యం,అహింస,శాంతి,సామాజిక సమానత్వం వంటి గాంధీజీ మహోన్నత ఆశయాలు నేటి తరానికి కూడా స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.
గాంధీజీ చూపిన అహింసా మార్గంలో ప్రతి ఒక్కరూ నడుస్తూ సమాజంలో శాంతి, సోదరభావం,ఐక్యతను పెంపొందించేందుకు కృషి చేయాలని సూచించారు.

**ఆయన పోరాటం చిరస్మరణీయం ఎమ్మెల్యే**

దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్మా గాంధీ చేసిన పోరాటం,ఆయన త్యాగాలు భారత ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. గాంధీజీ కలలుగన్న స్వచ్ఛమైన,సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్మన్,కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ పాలకవర్గం సభ్యులు,మండల పార్టీ నాయకులు,సీనియర్ నాయకులు,వివిధ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# మల్కారం రోడ్డుకు మోక్షం..

### ఏళ్ల నిరీక్షణకు తెర..బీటీ రోడ్డు పనులు ప్రారంభం..





**శంషాబాద్, (ప్రజావినికిడి): అక్టోబర్ 2:** మల్కారం రెవెన్యూ పరిధిలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న బీటీ రోడ్డు నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి.కేబి దొడ్డి నుంచి రాయన్నగూడ చౌరస్తా వరకు రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. మల్కారం సర్పంచ్ కొత్త బిక్షపతి రెడ్డి పనులను ప్రారంభించారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సహకారంతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు.రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు తెలిపారు.రోడ్డు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు అధికారులను కోరినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. తాజాగా బీటీ రోడ్డు పనులు ప్రారంభం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.రోడ్డు నిర్మాణం పూర్తయితే రాకపోకలకు ఇబ్బందులు తొలగి,ప్రయాణ సౌకర్యం మెరుగుపడుతుందని తెలిపారు. రోడ్డు నిర్మాణానికి సహకరించిన సర్పంచ్ కొత్త బిక్షపతి రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, ప్రజాప్రతినిధులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జగన్‌మోహన్‌రెడ్డినవీన్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సూర్యప్రకాశ్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

# ఈ నెల 4 శంషాబాద్ లో జరగబోయే ఓబీసీల సభను విజయవంతం చేయండి..

### మండల పార్టీ అధ్యక్షుడు ఎన్.చంద్రశేఖర్ పిలుపు..




**జిల్లెడుచౌదరి గూడెం,(ప్రజావినికిడి):** మండల పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ, అక్టోబర్ 4న శంషాబాద్ పరిధిలోని గొల్లపల్లి రోడ్డులో టిపిసిసి ఓబీసీ సెల్ రాష్ట్ర చైర్మన్,ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్,షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న భారీ బహిరంగ సభ జన సమీకరణ అంశాలపై పార్టీ నాయకులతో సమావేశమయ్యారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఓబీసీ రాష్ట్ర చైర్మన్ కు సరైన నాయకుడిగా గుర్తించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యతలు అప్పగించారని,జాతి కోసం ఆయన కృషి చేస్తాడనినమ్మకంరాష్ట్రప్రజలకుఉందన్నారు.భారత్ జోడో యాత్రలో భాగంగా రాహుల్ గాంధీ కాశీ నుంచి కన్యాకుమారి వరకు చేపట్టిన పాదయాత్రలో బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంబడే బీసీ డిక్లరేషన్ చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా కామారెడ్డి డిక్లరేషన్ లో భాగంగా బీసీల లెక్క తేలుస్తామని ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంబడే యుద్ధ ప్రాతిపదికన బీసీల లెక్క తేలుతూ రిజర్వేషన్లు ఆమోదానికై ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తే నరేంద్ర మోడీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.నరేంద్ర మోడీ ఓబిసి అని చెప్పడం కాదు,బీసీల రిజర్వేషన్ తేల్చాలని గుజరాత్ అభివృద్ధిపై పెట్టిన దృష్టి దేశ ఓబీసీలపై ఎందుకు లేదని ప్రశ్నించారు.రాబోయే కాలంలో బీసీలందరం ఐక్యమత్యంతో 12 సంవత్సరాల నుంచి బీసీల లెక్క తేల్చలేని నరేంద్ర మోడీని ప్రధాని పదవి నుంచి గద్దె దించి రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేసి బీసీల హక్కులను సాధించుకుందామని ఆయన కోరారు. బహిరంగ సభకు అధిక సంఖ్యలో బీసీలు తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

# జాతిపిత మహాత్మా గాంధీ 157వ జయంతి

### గడ్డిఅన్నారం బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘన నివాళులు



**ఎల్బీనగర్, అక్టోబర్ 2 (ప్రజావినికిడి):** అహింసా, శాంతియుత పోరాటం ద్వారా మన హక్కులను పొందే మార్గాన్ని చూపిన జాతిపిత మహాత్మా గాంధీ 157 వ జయంతి సందర్భంగా ఆ మహనీయుడికి గడ్డిఅన్నారం బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించి స్మరించుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్,బిచ్చేనేపల్లి వెంకటేశ్వర్ రావు,మాజీ కౌన్సిలర్ రమేష్ ముదిరాజ్, డివిజన్ అధ్యక్షులు జక్కల శ్రీశైలం యాదవ్,యువజన నాయకులు గండి సన్నీ యాదవ్,రవీందర్ రెడ్డి,తిరుపతి,ప్రదీప్ గౌడ్,యాద శంకర్,విక్కీ గౌడ్,ఉదయ్, అరుంధతి,పరమేశ్వరి,అరుణ,వాణి,ఉమ,వరలక్ష్మి,హసీనా,పద్మ,తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ జయంతి.. ప్రపంచ వృద్ధుల దినోత్సవం..

## సందర్భంగా ఘనంగా సేవా కార్యక్రమాలు..





**హైదరాబాద్,(ప్రజావినికిడి):** గాంధీ జయంతి అదేవిదంగా 23వ ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ దోమలగూడలోని ఏ.వి.కాలేజీలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వివిధ సేవా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ శ్రీనివాస హాస్పిటల్, సంతోష్ నగర్ వైద్య బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలు, సీనియర్ సిటిజన్స్ హెల్త్ క్యాంప్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లయన్స్ డిస్ట్రిక్ట్ 320ఏ గవర్నర్ ఎల్ ఎన్.డాక్టర్ సురేష్ జగ్నని హాజరై విజయవంతం చేశారు.ఈ హెల్త్ క్యాంప్లో భాగంగా ఆర్థోపెడిక్ బోన్ స్ట్రెంగ్త్ అసెస్మెంట్, ఫిజిషియన్ కన్సల్టేషన్ నిర్వహించి, పాల్గొన్న సీనియర్ సిటిజెన్స్ కి అవసరమైన వైద్య సలహాలు, చికిత్సా సూచనలు అందించారు. లయన్ డాక్టర్ బండారు ప్రభాకర్ చైర్పర్సన్ అలాగే స్పాన్సర్గా నిర్వహించిన బతుకమ్మ వేడుకలను లయన్ డీఆర్. బండారు సుజాత,లయన్ శేఖర్ ప్రత్యేకంగా సహకరించారు. అనంతరం అందించిన

బహుమతుల స్పాన్సర్లుగా లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ డెక్కన్ ప్రెసిడెంట్ మరియు వెంకటేశ్వర్ రెడ్డి (ఎస్ఎన్ కార్ డెకర్స్ చంపాపేట్ యజమాని) సెక్రెటరీ లయన్ మనిషా సింగ్-కోశాధికారి లయన్ నవీన్ సహకరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, వృద్ధుల ఆరోగ్యం, సంక్షేమం పట్ల సమాజంలో అవగాహన పెంపొందించడంతో పాటు సేవా కార్యక్రమాల ద్వారా వారికి అండగా నిలవడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఛీఫ్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ప్రదీప్ రెడ్డి, సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కళ్యాణ్, సీనియర్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ గంగాధర్, ఆసుపత్రి వైద్యులు, లయన్ ప్రమోద్ సింగ్,లయన్ రమా రెడ్డి,ఇతర లయన్స్ క్లబ్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గాంధీజీ,లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఘన నివాళులు

### పాల్గొన్న బీజేపీ బీసీ మోర్చా నాయకుడు ఆనంద్ గౌడ్

**షాద్ నగర్,(ప్రజావినికిడి):** గాంధీ జయంతి సందర్భంగా పట్టణంలోని ఫరూక్‌నగర్,ఈశ్వర్ కాలనీ, గంజి సమీపంలో గాంధీ జయంతి,లాల్ బహదూర్ శాస్త్రి జయంతిల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో అందెబాబయ్య,ముఖ్యఅతిథిగా బీజేపీ ఓబీసీ మోర్చా నాయకుడు ఆనంద్ గౌడ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మహాత్మా గాంధీ,మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా అందె బాబయ్య మాట్లాడుతూ,

మహాత్మా గాంధీ సత్యం,అహింస,శాంతి, సోదరభావం వంటి విలువలను దేశ ప్రజలకు చాటిచెప్పారని, ఆయన ఆశయాలు నేటికీ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని అన్నారు. దేశానికి లాల్ బహదూర్ శాస్త్రి అందించిన సేవలను స్మరించుకుంటూ,ఆయన సరళత,నిజాయితీ,దేశభక్తి, క్రమశిక్షణ వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు.

అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమాల్లో భాగంగా మున్సిపల్ కార్మికులను శాలువాలతో సత్కరించి, పట్టణ పరిశుభ్రతతో పాటు ప్రజలకు అందిస్తున్న వారి సేవలను



అభినందించారు. కార్మికుల సేవలు సమాజానికి ఎంతో కీలకమని, వారి కృషిని ప్రతి ఒక్కరూ గుర్తించి గౌరవించాలని అన్నారు.అదేవిధంగా ఫరూక్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి అక్కడ చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు.శాస్త్రి చూపిన సేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా నాయకురాలు లావణ్య, వంశీకృష్ణ,9వ వార్డు కౌన్సిలర్ ప్యాట అశోక్,ఎస్సీ మోర్చా అధ్యక్షుడు విట్యాల నరసింహ, వెంకన్నల వెంకటేష్,చెట్ల వెంకటేష్,శ్రీనివాస్ చారి,మురళి,రిషికేష్,రవి నాయక్,



నందు,గజ్జల ప్రవీణ్,నక్కల మల్లేష్,పి.రవికుమార్ గౌడ్, సత్యనారాయణ, భాస్కర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ జయంతిని పురస్కరించుకొని కమ్మదనం గురుకుల పాఠశాలను సందర్శించిన మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు..

### గాంధీ జయంతి సందర్భంగా విద్యార్థినిలకు పలు సూచనలు,సలహాలు..





**షాద్ నగర్,(ప్రజావినికిడి):** షాద్ నగర్ నియోజకవర్గంలోని ఫరూక్ నగర్ మండలంలోని కమ్మదనం గురుకుల పాఠశాలను గాంధీ జయంతి సందర్భంగా సందర్శించిన టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు,షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులను ఉద్దేశించి పలు సూచనలు,సలహాలు,చేస్తూ జీవితంలో ఎలా ముందుకు వెళ్లాలలో వివరించారు. అనంతరం గాంధీ జయంతి సందర్భంగా గాంధీజీ దేశానికి అందించిన సేవలను, స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన పోషించిన కీలక పాత్రను విద్యార్థినిలకు వివరించారు.సత్యం,అహింస, శాంతి,సామాజిక సమానత్వం వంటి గాంధీజీ మహోన్నత ఆశయాలు నేటి తరానికి కూడా స్ఫూర్తిదాయకమని మాజీ ఎమ్మెల్యే పేర్కొన్నారు.గాంధీజీ చూపిన అహింసా మార్గంలో ప్రతిఒక్కరూనడుస్తూసమాజంలోశాంతి,సోదరభావం,ఐక్యతను పెంపొందించేందుకు కృషి చేయాలని సూచించారు.దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్మా గాంధీ చేసిన పోరాటం,ఆయన త్యాగాలు భారత ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు.గాంధీజీ కలలుగన్న స్వచ్ఛమైన,సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.విద్య ద్వారానే సమాజంలో సామాజిక అసమానతల తొలగింపు విద్యనే సమాజంలో అంటరానితనం, వెలివేత, బడుగులు,బలహీనులు,బలవంతులు అనే భేదం లేకుండా అందరిని సమానంగా ఒకే చోట చేర్చేదే విద్య అని ఆయన వివరించారు.విద్య ద్వారానే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని సమాజం పట్ల అవగాహన ప్రశ్నించే తత్వం విద్యార్థి దశనుంచే పెంపొందించుకోవాలని తద్వారా సమాజంలో అసమానతులను తొలగించే ఆయుధం విద్యనే అని ప్రతి విద్యార్థిని స్వేచ్ఛగా విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని,రాబోయే తరాలకు ఈ పాఠశాల విద్యార్థినిలు బాసటగా నిలవాలని ఆకాంక్షించారు.

# రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థుల విజయమే లక్ష్యం

### ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించాలి.. నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి

**భువనగిరి,(ప్రజావినికిడి):** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు స్థానాల్లో బీజేపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా ఇన్‌చార్జి నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు.యాదాద్రి భువనగిరి జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఉటుకుర్ అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కార్యశాలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించడం కార్యకర్తలు తమ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు.

ఒక్కో కార్యకర్తకు.. ఒక్కో బాధ్యత

ప్రతి పట్టభద్రుడితో అనుసంధానం అనే లక్ష్యంతో




క్షేత్రస్థాయిలో పనిచేయాలని అన్నారు.కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, పరిచయస్తుల్లోని పట్టభద్రులను గుర్తించి ఓటర్ నమోదుకు ప్రోత్సహించాలని,వాట్సాప్, డిజిటల్ మాధ్యమాల ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు.పట్టభద్రుల సమస్యలు, హక్కులు, భవిష్యత్ అవసరాలను శాసనమండలిలో బలంగా వినిపించేందుకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ప్రాతినిధ్యం కీలకమని పేర్కొన్నారు. బీజేపీ అభ్యర్థుల విజయానికి ప్రతి కార్యకర్త క్రమశిక్షణ,సమన్వయంతో పూర్తి బాధ్యత తీసుకుని పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బూర నర్సింహ గౌడ్,జిల్లా అధ్యక్షులు ఉటుకుర్ అశోక్ గౌడ్,గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ నమోదు జిల్లా కన్వీనర్ పాశం భాస్కర్,కో-కన్వీనర్ దాసరి మల్లేశ్,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల మురళీధర్ రెడ్డి, మాయా దశరథ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వికారాబాద్,పరిగి,చేవెళ్లలలో టిడిపి ఆధ్వర్యంలో గాంధీజీకి ఘన నివాళులు..





**వికారాబాద్,(ప్రజావినికిడి):**
వికారాబాద్ జిల్లా కేంద్రం,పరిగి, చేవెళ్ల నియోజకవర్గ పరిధిలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.కార్యక్రమానికి టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు,షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు హాజరై మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.అలాగే చేవెళ్లలో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఒక్కని నరసింహులు మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్య సాధన కోసం మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస మార్గాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు.గాంధీజీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

**తెదేపా పార్టీ ఆధ్వర్యంలో వస్తున్న మీకోసంపాదయాత్ర**
వస్తున్న మీకోసం (2 అక్టోబర్ 2012)సంవత్సరంలో నారా చంద్రబాబునాయుడు అనంత పురం జిల్లా హిందూపురం నియోజకవర్గ నుండి తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో వస్తున్న మీకోసం పాదయాత్ర ప్రారంభించారు వివిధ జిల్లాల మీదుగా 21వ రోజు తెలంగాణలోనీ మహబూబ్ నగర్ జిల్లా అలంపూర్ నియోజకవర్గం వడ్డేపల్లి మండలం రాజోలి గ్రామంలో ప్రవేశించింది అన్నారు, జిల్లాలో సుమారు 18 రోజులపాటు సాగిన పాదయాత్రలో కొనసాగుతున్న తరుణంలో (24/10,/2012) నాడు అయిజ గ్రామంలో దసరా పండుగను కుటుంబ సమేతంగా నారా చంద్రబాబు నాయుడు కుటుంబ సభ్యులు నారా భువనేశ్వరి,లోకేష్ లతో కలిసి దసరా పండుగను నిర్వహించుకున్నారు.ఈ పాదయాత్ర సాగుతున్న తరుణంలో పరిగి మండలంలోని వడ్డేపల్లి గ్రామంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షులుగా బక్కాని నర్సింహులు నుఎన్నుకోవడం జరిగిందన్నారు.నాటి కార్యక్రమంలో నేటి తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి,వేంనరేందర్ రెడ్డి లతో సహా అనేక మంది తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

అనంతరం రంగారెడ్డి జిల్లాలో 10 రోజులపాటు పాదయాత్ర కొనసాగిస్తూ,తెలంగాణలోనీ పాలేరు నియోజకవర్గం మీదుగా కృష్ణా జిల్లాలోకి పాదయాత్ర ప్రవేశించింది అన్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మహాత్మా గాంధీ విగ్రహాల ఏర్పాటుతో పాటు స్వరాజ్య సాధన,ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఎంతో కృషి చేశారని ఒక్కని నరసింహులు గుర్తుచేశారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం,సామాజిక సమానత్వం, పరిశుభ్రత వంటి అంశాలను ఆచరణలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చంద్రయ్య,సుభాన్ గౌడ్,బంటారం నరసింహులు, యాదయ్యగౌడ్, సుధాకర్ నాయుడు, రాఘవులు ,చంద్రశేఖర్ గౌడ్,కార్యకర్తలు,స్థానిక ప్రజలు పాల్గొని గాంధీజీకి ఘన నివాళులర్పించారు.

# మహాత్మా గాంధీ ఆశయాలను కొనసాగిద్దాం

## మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్యయాదవ్




**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
మహాత్మా గాంధీ ఆశయాలను కొనసాగిద్దామని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్యయాదవ్ అన్నారు. మహాత్మా గాంధీజీ జయంతి పురస్కరించుకుని షాద్ నగర్ మున్సిపాలిటీలోనీ20వ వార్డు వినాయక గంజ్,జానంపేట మహాత్మా గాంధీ విగ్రహాలకు మాజీ మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్,కౌన్సిలర్లతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ, మహాత్మా గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని,ఆయన చూపిన అహింసా మార్గంలో నడుస్తూ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.జాతిపిత మహాత్మాగాంధీ తన సిద్ధాంతమైన సత్యం, అహింసాను పాటించడంలో ప్రపంచ మానవాళికి ఆదర్శంగా నిలిచారన్నారు.ఆయన ఆశయ సాధనకు ప్రతీఒక్కరు కృషి చేయాలన్నారు.అలాగే లాల్ బహుదూర్‌శాస్త్రి జై జవాన్ జై కిసాన్ అంటూ నినాదాలచ్చి దేశానికి సైనికుల,రైతుల గొ ప్పతనాన్ని తెలియజేసిన మహనీయుడు అన్నారు.వారి ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

# కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న నెక్నాంపూర్ వాసికి సిటిజన్స్ కౌన్సిల్ చేయూత

**గండిపేట్, (ప్రజావినికిడి): అక్టోబర్ 2,**
కిడ్నీ వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్న నెక్నాంపూర్ గ్రామానికి చెందిన పాకాల యాదయ్య కుటుంబానికి ది సిటిజన్స్ కౌన్సిల్ (ఫర్ఎ బెటర్ సొసైటీ) ఆర్థిక సహాయం అందించింది. యాదయ్య అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న కౌన్సిల్ అధ్యక్షుడు బొమ్ము ఉపేంద్రనాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి షేక్ ఆరిఫ్ మహమ్మద్, కార్యవర్గ సభ్యుడు రమ్మ సుబ్బారెడ్డి స్పందించి తమ వంతు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. యాదయ్య కుమారుడు పాకాల సాయి మున్సిపల్ సిబ్బందిగా పనిచేస్తున్నారు. కౌన్సిల్ వ్యవస్థాపక ఛైర్మన్ ధూళిపాళ సీతారాం, జాయింట్ సెక్రటరీ అనుపమ్ కపూర్,కార్యవర్గ సభ్యులు ఆకుల నరేష్, రామచంద్రరావు ఈ కార్యక్రమంలో పాల్గొని యాదయ్య కుటుంబానికి తమ సంఘీభావాన్ని తెలిపారు.




ఈ సందర్భంగా కౌన్సిల్ ప్రతినిధులు మాట్లాడుతూ, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. అనారోగ్యంతో, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న కుటుంబాలకు అవసరమైన సమయంలో సహాయం అందించడం ద్వారా మానవతా విలువలను చాటుకోవచ్చని పేర్కొన్నారు. నెక్నాంపూర్‌లో ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలుస్తూ సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని కౌన్సిల్ ప్రతినిధులు తెలిపారు.

# ఎర్రబొడ అంగన్‌వాడీ కేంద్రంలో అగ్నిప్రమాదం

## బియ్యం, గుడ్లు,ఆట వస్తువులు దెబ్బతినడంతో నష్టం

**రాజేంద్రనగర్, (ప్రజావినికిడి): అక్టోబర్ 2,** ఎర్రబొడ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఘటనను అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులకు సమాచారం అందించారు. జిల్లా కలెక్టర్, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి ఆదేశాల మేరకు సీడీపీఓ కవిత, సూపర్‌వైజర్ శారద ఎర్రబొడ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. అనంతరం స్థానికులతో మాట్లాడి అగ్నిప్రమాదానికి సంబంధించిన వివరాలను సేకరించారు. అగ్నిప్రమాదంలో అంగన్‌వాడీ కేంద్రంలోని బరువు తూచే పరికరాలు,ఆట వస్తువులు,పాత రిజిస్టర్లు,90 గుడ్లు,50 కిలోల బియ్యం దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. జరిగిన నష్టానికి సంబంధించిన పూర్తి వివరాలతో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారికి నివేదిక సమర్పించారు.




జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అగ్నిప్రమాద ఘటనపై అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.



# కాటేదాన్‌లో ఘనంగా కర్రపూజ

**రాజేంద్రనగర్,(ప్రజావినికిడి): అక్టోబర్ 2:**
దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల ప్రారంభంలో భాగంగా నవదుర్గ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాబుల్ రెడ్డి నగర్ బొడ్రాయి వద్ద శుక్రవారం కర్రపూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలు,మంగళ వాయిద్యాల నడుమ సంప్రదాయబద్ధంగా కర్రను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీ ప్రసన్న ఎస్ఎల్ఎఫ్ ఆహ్వానం మేరకు కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్ ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,దుర్గాదేవి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. నవరాత్రుల సందర్భంగా నవదుర్గ అసోసియేషన్ ప్రాంగణంలో తొమ్మిది రోజుల పాటు అమ్మవారి ప్రత్యేక పూజలు, హోమాలు, లలితా సహస్రనామ పారాయణం, హారతి, తీర్థప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# గాంధీజీ ఆశయాలే నేటి సమాజానికి మార్గదర్శకం

## యువత గాంధీజీ సిద్ధాంతాలను ఆచరించాలి.. - డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్..




**శంషాబాద్, (ప్రజావినికిడి): అక్టోబర్ 2:** మహాత్మా గాంధీజీ చూపిన సత్యం,అహింస, సామాజిక న్యాయం మార్గాలు నేటి సమాజానికి మార్గదర్శకాలని డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు మైలారం ప్రవీణ్‌కుమార్ అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకునిశంషాబాద్ కేంద్రంలోని మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీజీ సాగించిన పోరాటం, సమాజంలో సమానత్వం, శాంతి కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. యువత గాంధీజీ ఆశయాలను ఆచరిస్తూ సామాజిక సమస్యలపై చైతన్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కుల,మత భేదాలకు అతీతంగా ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించి సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల ఉపాధ్యక్షుడు శేఖర్, సీఐటీయూ మండల అధ్యక్షుడు జగ్గల శామ్యూల్, సీఐటీయూ నాయకుడు ఏపూరి పవన్, మున్సిపల్ నాయకుడు డి. నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# సంతోషిమాత విగ్రహంపై కర్రలతో దాడి

## హైదరాబాద్‌లో ఉద్రిక్తత:

## నిందితుడికి మానసిక సమస్యలు ఉన్నాయని పోలీసు వర్గాల సమాచారం



**హైదరాబాద్ (ప్రజావినికిడి):**
హైదరాబాద్‌లోని చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. భవానీ నగర్ కాలనీలోని శ్రీ సంతోషిమాత ఆలయంలో శుక్రవారం ఉదయం పూజలు జరుగుతుండగా ఒక వ్యక్తి అమ్మవారి విగ్రహంపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనతో భక్తులు, స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి, ఆందోళనకు గురయ్యారు.వివరాల్లోకి వెళితే, ఆలయంలో పూజలు నిర్వహిస్తుండగా ఒక వ్యక్తి లోపలికి ప్రవేశించాడు. నేరుగా గర్భగుడిలోకి వెళ్లి తన చేతిలోని కర్రలతో విగ్రహంపై దాడి చేయడం ప్రారంభించాడు. ఈ హఠాత్పరిణామంతో భయాందోళనకు గురైన భక్తులు కేకలు వేశారు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ సైదులు, ఎల్బీ నగర్ ఏసీపీ రవీంద్ర రెడ్డి నిందితుడిని అదుపులోకి తీసుకుని, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆలయ ఛైర్మన్ శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

నిందితుడిని మహమ్మద్ అన్సారీగా పోలీసులు గుర్తించారు. అతను కొంతకాలంగా మానసిక సమస్యలతో బాధపడుతూ చికిత్స పొందుతున్నట్లు పోలీసు వర్గాల సమాచారం. నిందితుడు గర్భగుడిలోకి వెళ్లి విగ్రహంపై దాడి చేస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

ఈ ఘటనపై బీజేపీ నేతలు తీవ్రంగా స్పందించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు నామమాత్రపు కేసు నమోదు చేశారని ఆరోపిస్తూ రంగారెడ్డి అర్బన్ బీజేపీ అధ్యక్షుడు వాణిపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి తదితరులు దిల్‌సుఖ్‌నగర్ ప్రధాన రహదారిపై ధర్నాకు దిగారు. ఆలయాలకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఆందోళనకారుల్లో కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం ఈ ఘటనపై పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు జరుపుతున్నారు.

# ముంబైలో పోటాపోటీ నిరసనలు..

## సీజేపీకి వ్యతిరేకంగా 'జెన్ నెక్స్ట్ ' ఆందోళన

**సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తూ ముంబైలో కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళన**

**సీజేపీకి వ్యతిరేకంగా 'జెన్ నెక్స్ట్ ముంబై' గ్రూప్ కౌంటర్ నిరసన**

**పోటాపోటీ ప్రదర్శనలతో ముంబైలో ఉద్రిక్త వాతావరణం**

**సోషల్ మీడియాలోనూ ఇరువర్గాల మద్దతుదారుల మధ్య మాటల యుద్ధం**

**భారీగా మోహరించిన పోలీసులు, భద్రతా బలగాలు**



**అక్టోబర్ 2 (ప్రజావినికిడి):**
ముంబైలో శుక్రవారం ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఓవైపు నిరసనలు చేపట్టగా, మరోవైపు ఆ పార్టీకి వ్యతిరేకంగా 'జెన్ నెక్స్ట్ ముంబై' బృందం కౌంటర్ ప్రదర్శన నిర్వహించింది. ఈ పోటాపోటీ ఆందోళనల కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.
గాంధీ జయంతి సందర్భంగా సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త నిరసనలకు సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే పిలుపునిచ్చారు. ఈ క్రమంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద, ముంబైలోని శివాజీ పార్క్ పరిసర ప్రాంతాల్లో ఆందోళనలు జరిగాయి. తమ నిరసనకు ప్రజలు మద్దతు ప్రకటించాలని పార్టీ ప్రతినిధి సౌరవ్ దాస్ విజ్ఞప్తి చేశారు.
వీరికి ప్రతిగా జెన్ నెక్స్ట్ ముంబై సభ్యులు అంబేద్కర్ విగ్రహం వద్ద శాంతియుతంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఒక నిరసనకారుడు మాట్లాడుతూ, "అభిజీత్ దీప్కే వంటి వ్యక్తులు రాజ్యాంగాన్ని అస్థిరపరచాలని చూస్తున్నారు. కానీ రాజ్యాంగాన్ని ఎలా కాపాడుకోవాలో, ఎలా గౌరవించాలో మాకు తెలుసు. అందుకే మేం బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్నాం. కాక్రోచ్ జనతా పార్టీ వైఖరిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోం" అని స్పష్టం చేశారు.
ఈ పోటాపోటీ ప్రదర్శనల ప్రభావంతో సోషల్ మీడియాలోనూ ఇరు వర్గాల మద్దతుదారుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. కొందరు జెన్ నెక్స్ట్ మద్దతుదారులు సీజేపీ సభ్యులను 'దిమాగీ నక్సల్స్'గా అభివర్ణించగా, జెన్ నెక్స్ట్ నిరసనల వెనుక బీజేపీ హస్తం ఉందని సీజేపీ వర్గాలు ఆరోపించాయి. పరిస్థితి అదుపు తప్పకుండా పోలీసులు, భద్రతా బలగాలు భారీగా మోహరించాయి. ఓటర్ల జాబితా సవరణ అంశంపై ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా సీజేపీ చేస్తున్న ప్రచారం ఏ స్థాయిలో విభేదాలకు దారితీసిందో ఈ ఘటనలు అద్దం పడుతున్నాయి.

# అక్టోబరు 13 నాటికి బంగాళాఖాతంలో అల్పపీడనం..

## వాయుగుండంగా మారే చాన్స్



**అక్టోబర్ 2(ప్రజావినికిడి):**
నైరుతి రుతుపవనాల సీజన్‌లో తీవ్ర వర్షపాత లోటుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆంధ్రప్రదేశ్‌కు వాతావరణానికి సంబంధించిన మరో కీలక అప్‌డేట్ వచ్చింది. బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుందని, ఇది వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ శుక్రవారం వెల్లడించింది. దీని కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపింది.సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం, అక్టోబర్ 12వ తేదీన ఉత్తర అండమాన్ సముద్రంపై ఉపరితల ఆవర్తనం ఏర్పడనుంది. దీని ప్రభావంతో అక్టోబర్ 13 నాటికి అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయి. ఈ అల్పపీడనం పశ్చిమ, వాయవ్య దిశగా ప్రయాణిస్తూ మరింత బలపడనుంది. అక్టోబర్ 15 నాటికి ఇది దక్షిణ, మధ్య బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో వాయుగుండంగా మారవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. రానున్న రోజుల్లో దీని గమనం, తీవ్రతపై మరింత స్పష్టత వస్తుందని, వాతావరణ పరిస్థితులను బట్టి మార్పులు ఉండవచ్చని పేర్కొన్నారు.
కాగా, ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కాలంలో (జూన్ 1 – సెప్టెంబర్ 30) రాష్ట్రంలో సాధారణం కంటే చాలా తక్కువ వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో సగటున 589.7 మిల్లీమీటర్ల వర్షపాతం కురవాల్సి ఉండగా, కేవలం 383.6 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 34.9 శాతం వర్షపాత లోటు ఏర్పడింది. ఈ నేపథ్యంలో బంగాళాఖాతంలో ఏర్పడనున్న ఈ వాతావరణ వ్యవస్థ ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయా లేదా అనే అంశంపై ఆసక్తి నెలకొంది.

# ప్రపంచానికి భారత ఆధ్యాత్మిక జ్ఞానం పరిష్కారం చూపుతుంది

**భారత్‌లో ధర్మం, దేశం వేర్వేరు కాదని మోహన్ భగవత్ స్పష్టీకరణ**

**దేశానికి ధర్మమే ప్రయోజనమని, ధర్మమే దేశాన్ని నిలబెడుతుందని వ్యాఖ్య**

**ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలకు భారత్ పరిష్కారం చూపుతుందని వెల్లడి**

**భారతీయ జ్ఞానాన్ని కాపాడటం మానవాళి భవిష్యత్తును కాపాడటమేనని ఉద్ఘాటన**



**అక్టోబర్ 2(ప్రజావినికిడి):**
భారతదేశంలో ధర్మం, దేశం వేర్వేరు కావని, ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లకు భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానమే పరిష్కారం చూపగలదని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సర్ సంఘచాలక్ మోహన్ భగవత్ పేర్కొన్నారు. శుక్రవారం నిర్వహించిన అఖిల భారత విహార్ సేవా గ్రూప్ 14వ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.
ఈ సందర్భంగా భగవత్ మాట్లాడుతూ, "మన దేశం, ధర్మం పరస్పర భిన్నమైనవి కావు. దేశానికి ధర్మమే ప్రాణాధారం, ధర్మమే దేశాన్ని సుస్థిరపరుస్తుంది. ఈ రెండూ ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉన్నాయి" అని స్పష్టం చేశారు. నేడు ప్రపంచం అభివృద్ధి–పర్యావరణ పరిరక్షణ, వ్యక్తిగత స్వేచ్ఛ–కుటుంబ వ్యవస్థ, మత విశ్వాసం–సంఘర్షణ వంటి అనేక వైరుధ్యాలతో సతమతమవుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "ప్రపంచం ప్రస్తుతం అస్తవ్యస్తంగా ఉంది. ఏ ఆనందమూ పరిపూర్ణంగా లభించడం లేదు. ఎక్కడా సమతుల్యత కనిపించడం లేదు, అతివాదం పెచ్చరిల్లుతోంది" అని ఆయన విశ్లేషించారు.
ఇలాంటి సంక్లిష్ట పరిస్థితులకు పరిష్కారం కోసం ప్రపంచం భారతదేశం వైపు ఆశగా చూస్తోందని భగవత్ అన్నారు. "ఈ సమస్యల నుంచి గట్టెక్కించే మార్గం భారత్ నుంచే వస్తుందని ప్రపంచ దేశాలకు తెలుసు" అని ఆయన వ్యాఖ్యానించారు. వేదాలు, ఉపనిషత్తులు, రామాయణం భారతాలు, భగవద్గీతతో పాటు జైన ఆగమాలు, త్రిపిటకాలు, గురు గ్రంథ్ సాహిబ్ వంటి అత్యున్నత జ్ఞాన సంపద మన దేశానికి ఉందని గుర్తుచేశారు. ఈ జ్ఞానాన్ని పుణికిపుచ్చుకున్న వారిని, వారి సంప్రదాయాలను కాపాడటం కేవలం ఒక మతపరమైన బాధ్యత మాత్రమే కాదని, అది సమస్త మానవాళికి చేసే సేవ అని కొనియాడారు. "మీరు కేవలం ఒకరి ప్రాణాన్ని కాపాడటం లేదు, మొత్తం మానవజాతి సురక్షిత భవిష్యత్తును రక్షిస్తున్నారు" అని భగవత్ ఉద్ఘాటించారు.

# పరిశుభ్రత సామాజిక బాధ్యత..

## స్వచ్ఛాంధ్రతోనే స్వర్ణాంధ్ర: సీఎం చంద్రబాబు

**నెలకు ఒక రోజైనా పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని ప్రజలకు సీఎం చంద్రబాబు పిలుపు**

**పరిశుభ్రత ప్రభుత్వ బాధ్యతే కాదు, అది సామాజిక బాధ్యత అని స్పష్టీకరణ**

**చెత్తను సంపదగా మార్చే కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్న ముఖ్యమంత్రి**

**గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే కృష్ణా, గోదావరి నదులు కలుషితమయ్యాయని విమర్శ**

**రాష్ట్రంలో వర్షపాత లోటుకు పారిశుద్ధ్య లోపాలు కూడా ఓ కారణమని వ్యాఖ్య**



**అక్టోబర్ 2 (ప్రజావినికిడి):**
పరిశుభ్రత కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, అది ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. స్వచ్ఛాంధ్ర సాధనలో ఐదు కోట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజలు భాగస్వాములు కావాలని, ప్రతి ఒక్కరూ నెలకు ఒక్క రోజైనా తమ పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం విజయవాడలో జరిగిన "స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర" అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలకు మనం అందించే నిజమైన ఆస్తి స్వచ్ఛాంధ్ర కార్యక్రమమేనని అన్నారు. కేవలం రోడ్లు శుభ్రంగా ఉంటే సరిపోదని, ప్రజల ఆలోచనా విధానంలో మార్పు రావాలని అభిప్రాయపడ్డారు. తమ ప్రభుత్వం చెత్తను ఒక సమస్యగా కాకుండా, సంపదగా చూస్తోందని, చెత్త నుంచి సంపద సృష్టించే కార్యక్రమాలను అమలు చేస్తోందని వివరించారు.
గత ప్రభుత్వ హయాంలో పరిశుభ్రతను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని చంద్రబాబు విమర్శించారు. వారి వైఖరి కారణంగానే కృష్ణా, గోదావరి నదులతో పాటు కాలువల్లోకి మురుగునీరు చేరి తీవ్రంగా కలుషితమయ్యాయని ఆరోపించారు. పర్యావరణంపై పడిన ఈ ప్రభావం వాతావరణ మార్పులకు కూడా దోహదపడిందని, ప్రస్తుతం రాష్ట్రం 53 శాతం వర్షపాత లోటును ఎదుర్కోవడానికి పారిశుద్ధ్య లోపాలు కూడా ఒక కారణమని ఆయన పేర్కొన్నారు.
ప్రతి పౌరుడు స్వచ్ఛాంధ్రలో భాగస్వామి అయినప్పుడే స్వర్ణాంధ్ర లక్ష్యాలు నెరవేరతాయని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రత పాటించిన గ్రామాలు, పట్టణాలు, వివిధ సంస్థలకు అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మంత్రులు నారాయణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరాం తదితరులు పాల్గొన్నారు.

# రాయలసీమ రైతుల తల రాతలు మారబోతున్నాయి

## మదనపల్లెలో రాయలసీమ ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ శంకుస్థాపనలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

**అక్టోబర్ 2 (ప్రజావినికిడి):**
కరవుతో పోరాడిన రాయలసీమను ఇకపై కరువు సీమగా కాకుండా, ప్రపంచ స్థాయి ఉద్యానవన కేంద్రంగా తీర్చిదిద్దడమే కటమి ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు రూ. లక్ష కోట్ల పెట్టుబడులతో సమగ్ర ప్రణాళికను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. రైతులకు సాగు నీటి సదుపాయాలను మెరుగుపరచడంతోపాటు, పంటలను మార్కెట్లకు వేగంగా తరలించేందుకు అవసరమైన రహదారులు, ఇతర మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అలాగే, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర, అదనపు విలువ లభించేలా ఆధునిక కోల్డ్ స్టోరేజీలు, ప్రాసెసింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పంట ఉత్పత్తి నుంచి నిల్వ, ప్రాసెసింగ్, రవాణా, మార్కెటింగ్ వరకు సమగ్ర వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చి రాయలసీమ రైతుల ఉత్పత్తులను దేశీయ మార్కెట్‌తోపాటు ప్రపంచ మార్కెట్‌కు చేరేలా చర్యలు చేపడుతున్నామని ఆయన వివరించారు.
శుక్రవారం మదనపల్లెలో రాయలసీమ ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ శంకుస్థాపన మహోత్సవంలో కేంద్ర మంత్రి మతి నిర్మాల సీతారామన్ , ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "రాయలసీమ గొప్ప చరిత్రకు, ప్రత్యేకమైన సంస్కృతికి, ఎన్నో చారిత్రాత్మక ఘట్టాలకు సాక్ష్యంగా నిలిచిన నేల. కృష్ణదేవరాయలు పాలించిన ఈ ప్రాంతం ఒకప్పుడు అనేక ప్రతికల పరిస్థితులను ఎదుర్కొంది. ఫ్యాక్షన్ రాజకీయాల ప్రభావంతో అశాంతికి గురైన సందర్భాలు ఉన్నాయి. అభివృద్ధికి ప్రతీకగా నిలవాల్సిన ప్రాంతంలో పచ్చని చెట్లను సైతం నరికి వేసిన పరిస్థితులు చూశారు. ఆ పరిస్థితుల నుంచి రాయలసీమను బయటకు తీసుకువచ్చి, అభివృద్ధి బాటలో నడిపించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎంతో కృషి చేశారు. 2024లో మీరు అందించిన ప్రజా తీర్పు ఈ మార్పుకు మరింత బలాన్ని ఇచ్చింది. ప్రజలు ఇచ్చిన ఆ విజయంతోనే ఈ రోజు రాయలసీమలో రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులతో అభివృద్ధి కార్యక్రమాలకు బాటలు పడ్డాయి.

**రెండేళ్లలో రూ.8 వేల కోట్ల అభివృద్ధి పనులు**

పల్లె పండుగ కార్యక్రమం ద్వారా రాయలసీమలో గత 2 ఏళ్లలో రూ.8 వేల కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టాం. అందులో భాగంగా రాష్ట్రంలో 2 లక్షల ఎకరాల్లో, అందులో రాయలసీమ ప్రాంతాన 62 వేల ఎకరాల్లో 28 వేల మంది రైతులకు లబ్ధి చేకూరేలా




ఉద్యాన పంటల సాగును విస్తరించాం. నీటి సంరక్షణలో భాగంగా దాదాపు 70 వేల ఫామ్ పాండ్లను నిర్మించి, అదనంగా 50 వేల ఎకరాల భూమిని సాగులోకి తీసుకొచ్చాం. రూ.4,500 కోట్లకు పైగా నిధులతో 23 వేలకు పైగా రహదారి పనులను చేపట్టి, 5 వేల కిలోమీటర్లకు పైగా రహదారుల నిర్మాణాన్ని పూర్తి చేశాం. ఉపాధి హామీ నిధులతో ప్రాజెక్ట్ జలధార ద్వారా నీటి సంరక్షణ చర్యలను బలోపేతం చేస్తూ, రాయలసీమను నీటి భద్రత ప్రాంతంగా తీర్చిదిద్దే దిశగా ఎన్నో చర్యల చేపట్టాం. తద్వారా ఈ ప్రాంతంలో భూగర్భ జలమట్టాలు సగటున 3.6 మీటర్లు పెరిగాయి.

**45 డిగ్రీల ఉష్ణోగ్రతలోనూ యాపిల్ సాగు**

రాయలసీమ రైతుల పట్టుదలకు ఉద్యాన సాగులో వస్తున్న మార్పులే నిదర్శనం. సాధారణంగా యాపిల్ సాగుకు అనుకలంగా భావించని 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అనంతపురం ప్రాంతంలోనూ కడా కె.ఎల్.డి. యాపిల్ సాగు సాధ్యమైంది. రాయలసీమలో మామిడి, అరటి, టమాటా, దానిమ్మ, నిమ్మ, స్వీట్ ఆరెంజ్ తోపాటు డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, ఆపిల్, బెర్రీస్ వంటి అధిక విలువ కలిగిన పంటలను కడా సాగు చేస్తున్నారు. మదనపల్లె ఆసియాలోనే అతిపెద్ద టమాటా సాగు ప్రాంతాల్లో ఒకటిగా ఉంది. రాయలసీమలో ఉద్యాన పంటలకు ఉన్న అపారమైన సామర్థ్యానికి ఇది నిదర్శనం.

**మూడు దశల్లో రూ. లక్ష కోట్ల ప్రణాళిక**

ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ డెవలప్‌మెంట్ ప్లాన్ కింద రూ.40 వేల కోట్ల ప్రభుత్వ పెట్టుబడితో పాటు, రూ.60 వేల కోట్ల ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షిస్తూ, రాబోయే 3 సంవత్సరాల్లో 3 దశల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయబోతున్నాం. రాయలసీమతో ఎల్ పాటు ప్రకాశం, మార్కాపురం జిల్లాలను కలుపుకుని మొత్తం 10 జిల్లాల్లోని 201 క్లస్టర్లలో ఈ ప్రణాళిక అమలు కానుంది. సాగునీటి కోసం రూ.21 వేల కోట్లతో రిజర్వాయర్లు, కాలువలు, చెరువులను అభివృద్ధి చేసి 9 లక్షల ఎకరాలకు కొత్తగా సాగునీరు అందించడంతోపాటు 4.3 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరిస్తున్నాం. 6.5 లక్షల హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్ ను విస్తరిస్తున్నాం. మరో రూ.15 వేల కోట్లతో 6 లక్షల హెక్టార్లలో ఉద్యానవన సాగును విస్తరించి, ప్రస్తుతం ఉన్న 8.4 లక్షల హెక్టార్ల ఉద్యాన విస్తీర్ణాన్ని 14.41 లక్షల హెక్టార్లకు పెంచే లక్ష్యంతో పనిచేస్తున్నాం. సుమారు రూ.4, 500 కోట్లతో దాదాపు 6 వేల కిలోమీటర్ల గ్రామీణ రహదారులను అభివృద్ధి చేస్తున్నాం.

**రైతు పొలం నుంచి ప్రపంచ మార్కెట్ వరకు**

రైతు పండించిన పంటకు సరైన విలువ లభించేలా కోల్డ్ స్టోరేజీలు, ప్యాక్‌హౌస్‌లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, వాల్యూ అడిషన్ సెంటర్లు, ఎగుమతి మౌలిక వసతులను ఉద్యానవన క్లస్టర్లతో అనుసంధానం చేయబోతున్నాం. పంట ఉత్పత్తి నుంచి నిల్వ, ప్రాసెసింగ్, రవాణా, మార్కెటింగ్, ఎగుమతుల వరకు పూర్తి వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నాం. ఈ మౌలిక వసతుల ద్వారా 40 నుంచి 45 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తిని నష్టపోకుండా కాపాడుకునే అవకాశం ఉంటుంది. మూడో సంవత్సరం నుంచి సుమారు రూ.81 వేల కోట్ల అదనపు గ్రాస్ వ్యాల్యూ అడిషన్‌తో పాటు ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 50 లక్షల ఉద్యోగ అవకాశాలు ఏర్పడే అవకాశం ఉంటుంది.

# 'నా వైఫ్ మిస్సింగ్'.. చాలాకాలం తర్వాత మళ్లీ జోడీగా వరుణ్ సందేశ్, శ్వేతా బసు




'కొత్త బంగారు లోకం' చిత్రంతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న వరుణ్ సందేశ్, శ్వేతా బసు ప్రసాద్ జంట చాలా కాలం తర్వాత మళ్లీ తెరపైకి రాబోతోంది. వీరిద్దరూ ప్రధాన పాత్రల్లో 'ఆహా' ఓటీటీ సమర్పిస్తున్న సరికొత్త ఒరిజినల్ సిరీస్ 'నా వైఫ్ మిస్సింగ్'. వినూత్నమైన కంటెంట్‌తో సబ్‌స్క్రైబర్లను నిరంతరం ఆకట్టుకుంటున్న ఆహా, ఈ సస్పెన్స్ థ్రిల్లర్‌తో మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. భార్య కనపడటం లేదంటూ ఒక భర్త పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఈ కథ మొదలవుతుంది. ఈ కేసులో నిజమేంటి అనే అంశం చుట్టూ కథనం సాగుతుందని తెలుస్తోంది. ఇటీవల ఆహా విడుదల చేసిన అప్‌డేట్‌లో "ప్రతి కేసుకు ఒక కథ ఉంటుంది, ఈ కేస్ లో నిజం ఏంటి?" అనే క్యాప్షన్ ప్రేక్షకులలో క్యూరియాసిటీని మరింత పెంచింది. తన భార్య మిస్సయ్యిందంటూ వరుణ్ సందేశ్ కంప్లైంట్ ఇవ్వడం, దాని వెనుక ఉన్న రహస్యం ఏమిటనేది సిరీస్‌లో ఉత్కంఠభరితంగా చూపించనున్నారని సమాచారం.వరుణ్ సందేశ్, శ్వేతా బసు ప్రసాద్‌లది టాలీవుడ్‌లో ఒక సక్సెస్‌ఫుల్ పెయిర్. 'కొత్త బంగారు లోకం' తర్వాత వీరిద్దరూ కలిసి నటిస్తున్న ప్రాజెక్ట్ ఇదే కావడంతో సిరీస్‌పై అంచనాలు సహజంగానే పెరిగాయి. చాలా ఏళ్ల తర్వాత ఈ జంట మళ్లీ కలిసి నటించడం ఈ ప్రాజెక్ట్‌కు ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది.ఈ సిరీస్‌ను తెలుగుతో పాటు తమిళ భాషల్లో కూడా ఒకేసారి అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆహా ప్రకటించింది. మిస్సింగ్ కేసు వెనుక ఉన్న మిస్టరీ ఏంటి? నిజంగానే శ్వేతా బసు పాత్ర అదృశ్యమైందా? లేక దీని వెనుక ఇంకేదైనా కుట్ర ఉందా? అనే ప్రశ్నలకు సమాధానం తెలియాలంటే సిరీస్ చూడాల్సిందే. త్వరలోనే 'నా వైఫ్ మిస్సింగ్' స్ట్రీమింగ్ తేదీని అధికారికంగా ప్రకటిస్తామని ఆహా టీమ్ తెలిపింది.

# రజనీకాంత్ 'జైలర్ 2' ట్రైలర్‌కు ముహూర్తం ఖరారు.. పండగకు ముందే రానున్న టైగర్!




సూపర్‌స్టార్ రజనీకాంత్ అభిమానులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న 'జైలర్ 2' సినిమాకు సంబంధించి కీలక అప్‌డేట్ వచ్చేసింది. ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ అధికారిక థియేట్రికల్ ట్రైలర్‌ను అక్టోబర్ 5, 2026న విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ అధికారికంగా ప్రకటించింది. బ్లాక్‌బస్టర్ విజయం సాధించిన 'జైలర్'కు సీక్వెల్‌గా వస్తున్న ఈ చిత్రం అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో, కళానిధి మారన్ సమర్పణలో సన్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది. ఇప్పటికే యూట్యూబ్‌లో ఈ సినిమా పేరుతో అనేక ఫ్యాన్-మేడ్, కాన్సెప్ట్ ట్రైలర్లు చక్కర్లు కొడుతున్న నేపథ్యంలో, అక్టోబర్ 5న రాబోయేది అఫీషియల్ ట్రైలర్ అని మేకర్స్ స్పష్టతనిచ్చారు. ఈ చిత్రంలో రజనీకాంత్ మరోసారి తన ఐకానిక్ 'టైగర్' ముత్తువేల్ పాండియన్ పాత్రలో కనిపించి ప్రేక్షకులను అలరించనున్నారు.ఈ సినిమాకు అనిరుధ్ రవిచందర్ అందిస్తున్న సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఇప్పటికే విడుదలైన 'హుకుమ్ రీలోడెడ్' థీమ్ సాంగ్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతూ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది.

తారాగణం పరంగా కూడా ఈ సీక్వెల్ మరింత భారీగా ఉండనుంది. ఎస్.జె. సూర్య, విద్యాబాలన్, మిథున్ చక్రవర్తి ముఖ్య పాత్రలు పోషిస్తుండగా, తొలి భాగంలో అదరగొట్టిన మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్‌లతో పాటు ఈసారి విజయ్ సేతుపతి కూడా ప్రత్యేక అతిథి పాత్రలో మెరవనున్నారు. దీంతో 'జైలర్ 2'పై సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.ద

# తెలుగులోకి 'హనుమాన్ అంశ్'.. రిలీజ్ డేట్ వచ్చేసింది!




ఆధ్యాత్మిక కథాంశంతో తెరకెక్కిన 'హనుమాన్ అంశ్' సినిమా బాక్సాఫీస్ దగ్గర భారీ వసూళ్లు సాధిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే రూ.400 కోట్ల మార్క్‌ను దాటిన ఈ సినిమా.. ఎట్టకేలకు తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తంగా తెలుగు వెర్షన్‌ను విడుదల చేయనున్నట్లు హోంబలే ఫిల్మ్స్ ప్రకటించింది.నిజానికి ఈ సినిమా తెలుగు వెర్షన్ సెప్టెంబర్ 18న విడుదల కావాల్సి ఉంది. దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌కు చెందిన ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ తెలుగు వెర్షన్‌ను సమర్పించనున్నట్లు తొలుత ప్రచారం జరిగింది. అయితే డీల్ కుదరకపోవడంతో త్రివిక్రమ్ ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నట్లు సమాచారం.

సెప్టెంబర్ 15న హైదరాబాద్‌లో తెలుగు టీజర్‌ను విడుదల చేసేందుకు ఏర్పాట్లు కూడా చేశారు. అయితే చివరి నిమిషంలో ఆ కార్యక్రమం రద్దయింది. ఇప్పుడు హోంబలే ఫిల్మ్స్ స్వయంగా తెలుగు విడుదల బాధ్యతలను తీసుకుంది.

కేవలం రూ.1.8 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కినట్లు చెబుతున్న ఈ సినిమా.. సెప్టెంబర్ 28 నాటికి భారత్‌లో రూ.300 కోట్లకు పైగా నెట్ వసూళ్లు సాధించింది. 52వ రోజుకు ఈ మార్క్‌ను అందుకుంది. ప్రపంచవ్యాప్తంగా రూ.400 కోట్లకు పైగా వసూళ్లు రావడంతో చిత్రబృందం ఆనందం వ్యక్తం చేస్తోంది.విశాల్ చతుర్వేది దర్శకత్వం వహించిన ఈ సినిమా.. నీమ్ కరోలి బాబా జీవిత ప్రేరణతో తెరకెక్కిన ఆధ్యాత్మిక కథ. లక్ష్మీ నారాయణ్ అనే వ్యక్తి ఆధ్యాత్మిక మార్గంలోకి వెళ్లి ప్రముఖ సాధువుగా ఎలా మారాడన్నదే కథ. నీమ్ కరోలి బాబా పాత్రలో శోభినవ్ సత్యా నటించారు. విహాన్ షెదెగే, పూర్ణిమ తివారీతో పాటు పలువురు కీలక పాత్రల్లో కనిపించారు.

# 'రణబాలి' పాత్ర వెనుక ముగ్గురు రాయలసీమ వీరులు..

## డైరెక్టర్ రాహుల్ ఆసక్తికర విషయాలు!



విజయ్ దేవరకొండ, రష్మిక జంటగా నటిస్తున్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'రణబాలి'పై ఆసక్తి పెరుగుతోంది. బ్రిటిషర్లకు వ్యతిరేకంగా పోరాడిన సింగనమల బొబ్బిలి రణబాలి అనే యోధుడి పాత్రలో విజయ్ కనిపించనున్నారు. దసరా కానుకగా అక్టోబరు 16న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో సినిమా మేకింగ్‌కు సంబంధించిన ఆసక్తికర విషయాలను చిత్ర బృందం వెల్లడిస్తోంది.

'రణబాలి' పాత్రను రాయలసీమకు చెందిన ముగ్గురు పాలెగాళ్ల వీరోచిత గాథల నుంచి స్ఫూర్తి పొంది తీర్చిదిద్దినట్లు దర్శకుడు రాహుల్ సాంకృత్యన్ తెలిపారు. బుడ్డా వెంగళ్‌రెడ్డి, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, గడేకల్ బొబ్బిలి నాగిరెడ్డి జీవితాలు ఇందులో కీలకంగా నిలిచాయని చెప్పారు.

ఈ ముగ్గురు వీరుల కథలు ఇప్పటికీ రాయలసీమలో పాటల రూపంలో ప్రచారంలో ఉన్నాయని రాహుల్ తెలిపారు. వారి జీవితాల్లోని వీరోచిత ఘటనలు, ప్రజల్లో ప్రచారంలో ఉన్న కథనాల నుంచి అంశాలను తీసుకుని 'రణబాలి' పాత్రను రూపొందించినట్లు వివరించారు. దీంతో విజయ్ పోషిస్తున్న పాత్ర వెనుక రాయలసీమ చరిత్ర, జానపద గాథల ప్రభావం ఉన్నట్లు తెలుస్తోంది.బ్రిటిషర్లకు వ్యతిరేకంగా పోరాడే యోధుడిగా విజయ్ దేవరకొండను ఈ సినిమాలో చూపించనున్నారు. రష్మిక కథానాయికగా నటిస్తోంది. పీరియాడికల్ నేపథ్యంతో తెరకెక్కిన ఈ యాక్షన్ డ్రామాను దసరా సందర్భంగా అక్టోబరు 16న థియేటర్లలో విడుదల చేయనున్నారు.



# లెజెండ్‌తో స్క్రీన్ పంచుకోబోతున్న భాగ్యశ్రీ..



సౌత్ సినిమా ఇండస్ట్రీలో వరుస అవకాశాలతో దూసుకెళ్తున్న అందాల భామ భాగ్యశ్రీ బోర్సే ప్రస్తుతం మలయాళంలోకి గ్రాండ్‌గా అడుగుపెడుతోంది. మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో, నేషనల్ అవార్డు గ్రహీత విష్ణు మోహన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్-ఇండియా యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'ఆపరేషన్ గంగా'లో ఆమె నటిస్తోంది. తాజాగా మోహన్‌లాల్‌తో కలిసి దిగిన ఒక బ్యూటిఫుల్ పిక్‌ను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ఆమె పెట్టిన పోస్ట్ ప్రస్తుతం నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ఆ విశేషాలు చూద్దాం..చారిత్రాత్మక రెస్క్యూ ఆపరేషన్ కథాంశం: రష్యా-ఉక్రెయిన్ యుద్ధ సమయంలో ఉక్రెయిన్‌లో చిక్కుకుపోయిన భారతీయ విద్యార్థులు మరియు పౌరులను సురక్షితంగా వెనక్కి తీసుకొచ్చేందుకు భారత ప్రభుత్వం చేపట్టిన చారిత్రాత్మక 'ఆపరేషన్ గంగ' ఆధారంగా ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. ఇక దేశభక్తి మరియు ఉత్కంఠభరితమైన సన్నివేశాలతో సాగే ఈ కథపై ప్రేక్షకులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. 'శ్రీ గోకులం మూవీస్' బ్యానర్‌పై గోకులం గోపాలన్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.స్టార్ కాంబినేషన్‌తో క్రేజీ ప్రాజెక్ట్: ఈ చిత్రంలో మోహన్‌లాల్ సరసన భాగ్యశ్రీ బోర్సే నటిస్తుండగా, బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్, ఆదిల్ హుస్సేన్ మరియు పార్థిబన్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇక ఈ సినిమాకు శాశ్వత్ సచ్‌దేవ్ సంగీతం అందిస్తుండగా, సౌత్ కొరియన్ స్టంట్ డైరెక్టర్ ఓ సే-యెంగ్ యాక్షన్ సీక్వెన్స్‌లను కొరియోగ్రఫీ చేస్తున్నారు. మోహన్‌లాల్‌పై భాగ్యశ్రీ ప్రశంసల జల్లు: ఇటీవల 'లెనిన్' సినిమాతో కెరీర్‌లో తొలి భారీ హిట్ అందుకున్న భాగ్యశ్రీ బోర్సే, ఈ సక్సెస్ జోష్‌లోనే మలయాళ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇస్తోంది. మోహన్‌లాల్‌తో కలిసి పనిచేస్తున్న అనుభూతిని పంచుకుంటూ సోషల్ మీడియాలో ఆయనతో ఉన్న పిక్‌ను షేర్ చేసింది. "ప్రియమైన మోహన్ లాల్ సార్, మీతో పని చేయడం నాకు ఎంతో గొప్ప అవకాశం.. ప్రతి రోజూ షూటింగ్‌లో మీ నుంచి చాలా విషయాలు నేర్చుకుంటున్నాను. మీరు నిజంగా అద్భుతమైన టాలెంట్ సార్" అంటూ తనకున్న అభిమానాన్ని చాటుకుంది. ఫాన్స్ కూడా ఈ క్రేజీ కాంబో కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నామని కామెంట్లు పెడుతున్నారు. దిగ్గజ నటుడు మోహన్‌లాల్ పక్కన నటించే గోల్డెన్ ఛాన్స్ దక్కించుకోవడం భాగ్యశ్రీ కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలవనుంది. 'ఆపరేషన్ గంగా' సినిమాతో ఆమె మలయాళంలోనూ తన సత్తా చాటడానికి సిద్ధమవుతోంది. లెనిన్ సక్సెస్ తర్వాత వస్తున్న ఈ పాన్-ఇండియా ప్రాజెక్ట్ భాగ్యశ్రీ రేంజ్‌ను మరింత పెంచడం ఖాయం.

# సమంతకు భారీ ఊరట..

## డీప్‌ఫేక్‌లపై బాంబే హైకోర్టు సీరియస్



సినీ నటి సమంతకు బాంబే హైకోర్టులో భారీ ఊరట లభించింది. డీప్ ఫేక్‌లు, ఎఐ సాంకేతికతను దుర్వినియోగం చేసే వారిపరై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. ఇతరుల ఫోటోలనే మార్ఫింగ్ చేయడం తదితర చర్యలు ఇతరుల హక్కులను ఉల్లంఘించడం కిందకు వస్తుందని కోర్టు తెలిపింది. ఈ మేరకు సమంత పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం సమంతకు సంబంధించిన అనధికారిక కంటెంట్ తొలగించాలని ఆదేశించింది. కాగా.. సమంత వ్యక్తిత్వ హక్కులకు సంబంధించి బాంబే హైకోర్టులో పిటిషన్ వేసింది. ఎఐ ప్లాట్‌ఫామ్‌లు, ఈ కామర్స్ పోర్టల్స్, డిజిటల్ మీడియా సంస్థలలో తన పేరు, ఫొటోలు, తన వాయిస్‌ను అనధికారికంగా ఉపయోగిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొంది. తన వ్యాపారం, గుడ్2విల్, ముంబైలో ఉన్నప్పటికీ చాలా వాణిజ్య కార్యకలాపాలు కోర్టు స్థానిక ప్రాదేశిక అధికార పరిధిని దాటి విస్తరించాయని సమంత తన పిటిషన్‌లో సమర్పించింది. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం సమంతకు సంబంధించిన అనధికారిక కంటెంట్‌ను తొలగించాలని కూడా కోర్టు ఆదేశించింది. సమంత పేరు, ఫోటోలు, గొంతు అనధికారికంగా ఉపయోగించకుండా నిరోధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసు తదుపరి విచారణ డిసెంబర్ 10వ తేదీకి వాయిదావ వేసింది.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613